పెనుమాకలంక వద్ద కొల్లేరు వరద ఉధృతి (డ్రోన్ చిత్రం)



కొల్లేరు.. గండం!

- పెనుమాకలంక రహదారి మూసివేత
- రహదారి వద్ద పోలీసు పికెట్
- పొంగిపొర్లుతున్న డ్రెయిన్లు

బిక్కుబిక్కుమంటున్న లంకవాసులు

కైకలూరు/మండవల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీవర్షాలకు కొల్లేరు పరవళ్లు తొక్కుతుండడంతో గ్రామాల చుట్టూ వరదనీరు భారీగా చేరింది. మండవల్లి, కైకలూరు మండలాల్లో కొల్లేరు సరస్సు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి 64 మేజర్, మైనర్ డ్రెయిన్ల ద్వారా కొల్లేరులోకి పెద్దఎత్తున నీరు చేరుతోంది. మండవల్లి మండలం పెద్దఎడ్లగాడి నుంచి పెనుమాకలంకకు వెళ్లే రహదారిపై నాలుగడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. రాకపోకలను నిషేధించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి పోలీసు పికెట్ పెట్టారు. మూడు రోజులు సెలవుల అనంతరం పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ మరబోట్లలో పెద్దఎడ్లగాడి వంతెన వద్దకు చేరుకున్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచి బోటు మరమ్మతుకు గురి కావడంతో ప్రత్యామ్నాయదారుల వెంబడి వెళ్లేందుకు ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మండవల్లి మండలం పెనుమాకలంక, ఇంగిలిపాక లంక, నందిగామలంక, పుల్లపర్రు, నుచ్చుమిల్లి, తక్కెళ్లపాడు, చింతపాడు గ్రామాల చుట్టూ పెద్దఎత్తున వరదనీరు చేరింది. ఎగువ నుంచి భారీగా వరదనీరు కొల్లేరులోకి చేరడం. పెద్దఎడ్లగాడి వంతెన కానాల వద్ద గుర్రపు డెక్క, తూడు పేరుకుపోవడంతో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు డ్రెయినేజీ శాఖ అధికారులు యంత్రాల సహాయంతో తొలగిస్తున్నారు. కైకలూరు మండలం ఆటపాక, గోనెపాడు వద్ద పోల్ రాజ్ డ్రెయిన్ నుంచి వరద నీరు కొల్లేరులోకి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆటపాక పక్షుల కేంద్రం సరస్సు నీటితో పోటెత్తుతోంది. సర్కారు కాలువ వద్ద రోజురోజుకు నీటి ఉధృతి పెరుగుతోంది. వాయుగుండం ప్రభావం తగ్గకపోతే పూర్తిగా కొల్లేరు లంక గ్రామాలన్నీ జలదిగ్బంధంలో చిక్కు కుంటాయి.

పెద్దఎడ్లగాడి వంతెన వద్ద గుర్రపుడెక్క తొలగింపు





కుక్కునూరు గోదావరి తీర ప్రాంతంలో వరద ఉధృతి

గోదావరికి వరదపోటు

- ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు
- భద్రాచలం వద్ద 38.30 అడుగులకు నీటిమట్టం
- ఉధృతంగా ఉరకలు వేస్తున్న శబరి
- గోదావరికి మరింత పెరగనున్న వరద ప్రవాహం

వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గోదావరి, శబరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఈ రెండు నదులకు వరద పోటెత్తుతోంది. సోమవారం రాత్రి 8 గంటలకు భద్రాచలం వద్ద 38.30 అడుగులకు నీటిమట్టం చేరుకోగా, పోలవరం వద్ద శబరి, గోదావరి సంగమం వద్ద శబరి నీటి మట్టం 30 అడుగులకు చేరుకుంది. మరో 12 గంటల్లో బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం, వాయుగుండంగా మారే అవకాశాలు ఉన్నాయని ఒడిశా, ఉత్తరాంధ్ర మధ్య తీరందాటే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంటూ విశాఖ, అనకాపల్లి, ఏలూరు, అల్లూరి సీతారామ రాజు జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. దీని కారణంగా 25 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు పేర్కొంది. ఇప్పటికే ఒడిశాలో కురుస్తున్న వర్షాలకు శబరి నదికి భారీగా వరద చేరుకుంటుంది. గోదావరిలో కలిసే వాగుల ద్వారా వరదనీరు వేలేరుపాడు మండలం నుంచి ప్రవేశిస్తుండగా దీని కారణంగా ఎద్దువాగు వంతెన నీట మునిగిపోయింది. దీంతో 15 గ్రామాలకు రాకపోకలు (మిగతా 8వ పేజీలో)



అల్పపీడనం.. జోరు వర్షాలు

- వేలేరుపాడులో 19.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు
- గోదావరి ఉధృతితో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి పార్థసారథి

ఏలూరుసిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అల్పపీడనం వాయుగుండంగా మారనుందని, మంగళవారం నుంచి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని విశాఖపట్నం తుఫాన్ హెచ్చరికల కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. వాయుగుండం ప్రభావంతో ఏలూరు జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఈనెల 24 వ తేదీన మరో అల్పపీడనం ఏర్పడుతుందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. భారీ వర్షాలు హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.



పోలవరం మెయిన్ బజార్‌లో కురుస్తున్న వర్షం

ప్రత్యేక కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు

గోదావరి వరద నేపథ్యంలో కలెక్టరేట్‌లో 1800-233-1077, 94910 41419 ఫోన్ నంబర్లతో, జంగారెడ్డి గూడెం ఆర్డీవో కార్యాలయంలో 83092 69056 నంబర్‌తోను, నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో 08656- 232717 నంబర్లతో ప్రత్యేక కంట్రోలు రూమ్స్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. అత్యవసర సమయంలో వినియోగం నిమిత్తం మోటార్ బోట్లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. ఉరు ములు, మెరుపులతో కూడిన వర్షం పడే సమయంలో చెట్లు, టవర్స్ పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎవ్వరూ ఉండరాదని సూచించారు.

1,542 హెక్టార్లలో వరి పంట ముంపు

వర్షాల కారణంగా జిల్లాలో 1,542 హెక్టార్లలో వరి పంట ముంపునకు గురైంది. ఇందులో 10 హెక్టార్లలో వరి నారుమళ్లు, 1,532 హెక్టార్లలో వరి నాట్లు వేసిన పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. పెదపాడు, ముదినేపల్లి, ఉంగుటూరు, నిడమర్రు, భీమడోలు, ఏలూరు, కామవరపుకోట, దెందులూరు, పెదవేగి తదితర మండలాల్లోని 50 గ్రామాల్లో 2,052 మంది రైతులకు సంబంధించిన వరి పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నట్టు జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ బాషా తెలిపారు. జిల్లాలో సార్వా వరి సాగులో ఇప్పటివరకు 1,092 హెక్టార్లలో వరి నారుమళ్లు, 32,494 హెక్టార్లలో వరి నాట్లు వేశారన్నారు. మిగిలిన పంటల పరిస్థితి బాగానే ఉందన్నారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు

గత 24 గంటల్లో అత్యధికంగా వేలేరుపాడు మండలంలో 19.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 9.4 మి.మీగా నమోదైంది. ఉంగుటూరు 17.6, పోలవరం 16, కొయ్యలగూడెం 15.4, జంగారెడ్డిగూడెం 12.6, టి.నరసాపురం 12.4, చాట్రాయి 12.2, కామవరపుకోట 12.2, చింతలపూడి 10.6, ముసునూరు 10.2, నిడమర్రు 9.8, ఏలూరు రూరల్ 8.8, ఆగిరిపల్లి 8.6, జీలుగుమిల్లి 8.6, బుట్టాయిగూడెం 8.6, భీమడోలు 8.6, దెందులూరు 8.4, ద్వారకాతిరుమల 7, పెదవేగి 6.8, ఏలూరు అర్బన్ 6.8, లింగపాలెం 6.4, కలిదిండి 6.2, ముదినేపల్లి 5.8, పెదపాడు 5.6, నూజివీడు 5.2, కుక్కునూరు 4.6, మండవల్లి 4.4, కైకలూరు 3.2 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

జాగ్రత్తగా ఉండండి
ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిశోర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వాయుగుండం నేపథ్యంలో అధిక వర్షాలు పడడం, గోదావరి నది వాగులు వంకలు, పరివాహక ప్రాంతాల్లో వరద నీరు ఎక్కువగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించే సమయంలో వాహనాలు నీటి ప్రవాహ వేగాన్ని గమనిస్తూ ఉండాల న్నారు. కాలువలు, వాగులు దాటే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. ఏదైనా అత్యవసర పోలీస్ సహాయం పొందడానికి డయల్ 112, 83329 59175కు సమాచారం అందిస్తే తక్షణమే పోలీసులు చేరుకుంటా రన్నారు. ఏ ప్రదేశంలోనైనా విద్యుత్ తీగలు తెగిపడి ఉంటే వెంటనే విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912కు లేదా పోలీస్ సహాయం కోసం 112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

జిల్లాలో 20 బార్లు

- గెజిట్ నోటిఫికేషన్.. లాటరీ విధానంలో షాపులు
- ఓపెన్ కేటగిరిలో 18 .. 26 వరకు దరఖాస్తుల స్వీకరణ
- గీత కార్మికులకు రెండు లైసెన్సులు..త్వరలో నోటిఫికేషన్
- జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య



గెజిట్ నోటిఫికేషన్‌ను చూపిస్తున్న ఆవులయ్య

ఏలూరు,ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడేళ్ల కాలానికి 20 బార్ల లైసెన్సుల జారీ కోసం గెజిట్ నోటిఫికేషన్‌ను కలెక్టర్ కె.వెట్రిసెల్వి సోమవారం విడుదల చేశారని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో వేలం ద్వారా షాపులను కేటాయించారని, ప్రస్తుతం లాటరీ ద్వారా షాపులకు లైసెన్సులు జారీ చేస్తారన్నారు. ఓపెన్ కేటగిరిలో 18 బార్ల లైసెన్సులకు తాము నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రిజర్వ్ చేసిన రెండు లైసెన్సులను (జంగారెడ్డిగూడెం(గౌడ), ఏలూరు కార్పొరేషన్ (శెట్టిబలిజ) గీత కార్మికులకు కేటాయించామని దానికి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. జిల్లాలో గతంలో ఇచ్చిన 15 బార్ల లైసెన్సుల గడువు ఈ నెలాఖరుతో ముగుస్తుందన్నారు. రానున్న మూడేళ్ల కాలానికి వేలంలో దక్కించుకున్న వారికి లైసెన్సులు జారీ చేస్తామన్నారు. జనాభా ప్రాతిపదికన కేటాయింపు లతో మరో మూడు బార్లు జిల్లాలో పెరిగాయన్నారు. ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.లత పర్యవేక్షణలో ఓపెన్ కేటగిరిలో 18 బార్లకు లైసెన్సుల జారీకి దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంది. 28న ఉదయం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి ఆధ్వర్యంలో లైసెన్సుల జారీ జరుగుతుందన్నారు. ఏలూరు నగరం-11, నూజివీడు-4, జంగారెడ్డిగూడెం-2, చింతలపూడి-1 బార్ కేటా యింపులు జరిగాయన్నారు. ఏలూరు, నూజివీడుల్లో బార్‌లకు రూ.55 లక్షలు ధర నిర్ణయించారని, చింతలపూడి, జంగారెడ్డిగూడెంల్లో రూ.35 లక్షలు ధర నిర్ణయించారని, ఆ మేరకు లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకునే వారు ఎన్ని దరఖాస్తులను చేసుకోవచ్చని, ఆసక్తి కలిగిన వారు రూ. ఐదు లక్షలు అప్లికేషన్ ఫీజు (నాన్ రిఫండ్‌బుల్) కింద సెంట్రలైజ్ బ్యాంకులే కాకుండా, గ్రామీణ బ్యాంకుల్లోనైనా ఎక్సైజ్‌శాఖ పేరిట డీడీ తీసి, ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్, హైబ్రీడ్ మోడ్‌లల్లోనైనా దరఖాస్తు చేసుకోవచ్చ న్నారు. ఒక బార్‌కు నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామని, ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ లైసెన్సులు వచ్చినా అతనికే అవి కేటాయింపు జరుగుతుందన్నారు. బార్‌కు లైసెన్సు పొందిన వ్యక్తి ఆరు వాయిదాల్లో సొమ్ము చెల్లించాలని, ఒక వాయిదాకు సంబంధించి ఫీజును ముందుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. గతంలో బార్‌లకు 10 నుంచి 11 గంటల వరకు తెరిచే అవకాశం ఉండేది, ఇప్పుడు ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు అమ్మకాలు చేసుకోవచ్చని, స్నాక్స్ విక్రయించుకునే వెసులు బాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. లైసెన్సు పొందిన యజ మానులు సెప్టెంబరు 1 నుంచి నెలరోజుల లోపు అన్ని ఏర్పాట్లతో బార్ తెరుకోవచ్చ న్నారు. విలేకరుల సమా వేశంలో ఏలూరు సీఐ ధనరాజ్ పాల్గొన్నారు.

వేగంగా.. సాగండి!

- ఇది ప్రజా ప్రభుత్వం
- అన్నింటా పరిష్కారం ముఖ్యం
- ఉపాధి పెండింగ్ బిల్లులు పరిష్కరించాల్సిందే
- రైతులకు అతిపెద్ద ప్రాధాన్యం
- నకిలీగాళ్ల భరతం పట్టాలి
- డీఆర్‌సీ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు
- వచ్చే సమావేశం నాటికి మరింత

పురోగతి : ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల



సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, మంత్రి కొలుసు పార్థసారథి, కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

'ఇది ప్రజాప్రభుత్వం. సాధ్యమైనంత మేర ప్రతీ సమస్యను చర్చించడం, పరిష్కారం దిశగా యంత్రాంగం అడుగులు వేయాలి. రైతు సమస్యలపై ప్రాధాన్యం ఇవ్వండి. భారీవర్షాలు, వరదలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా సమాయత్తం కండి. అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన రైతులందరికీ పథకం వర్తించేలా ఆన్‌లైన్‌లో ఈనెల 20 వరకు దరఖాస్తు చేసుకోవడానికి వీలుంది. క్షేత్రస్థాయి వరకు ఈ సమాచారం వెళ్లేలా ఎమ్మెల్యేలతో పాటు అధికారులు చొరవ చూపాలి...' అంటూ రాష్ట్ర పౌర సరఫరాలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు ప్రస్తావనకు వచ్చాయి. అనేక ఇబ్బందులపై ఎమ్మెల్యేలు గళం విప్పారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులను విడుదల చేసేలా చూడాలని ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తల్లికివందనం పథకంలో కరెంట్ వినియోగం సమస్య, ఎరువులు జారీలో, కల్తీ విత్తనాల విషయంలో ఇబ్బందులను ఏకరవు పెట్టారు. మంత్రి కొలుసు పార్థసారథి సైతం అనేక సమస్యలను ప్రస్తావించారు. పౌరసరఫరాల అధికారులతో పాటు జేసీ ధాత్రి రెడ్డిని ఇన్‌చార్జి మంత్రి అభినందించారు.

గీత దాటితే క్రిమినల్ కేసులు

కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు సరఫరా చేసి రైతులను మోసం చేసే ఏ ఒక్కరిని వదలకండి, రైతులకు అన్యాయం చేయాలని ప్రయత్నించే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఇటువంటి వారందరిపైన కఠిన చర్యలు తీసుకోవాల్సిందే. క్రిమినల్ కేసులు నమోదు చేసి శిక్ష పడేలా చూడాలని మంత్రి మనోహర్ అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమానికి సీఎం చంద్రబాబు అత్యధిక (మిగతా 8వ పేజీలో)

ఎరువుల జారీలో జాప్యం
దెందులూరు ఎమ్మెల్యే ప్రభాకర్



రైతులకు ఎరువులు అందించడంలో కోపరేటివ్ సొసైటీల్లో ఆధార్ కార్డు చూపించమని, ఓటీపీ కారణా లతో జాప్యం జరుగుతోంది. రైతులు ఇబ్బంది పడుతు న్నారు. డెల్టాలో పామాయిల్ వేస్తున్నారు. అక్కడ కూడా ఆయిల్ ఫ్యాక్టరీ నెలకొల్పాలి. నా నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు సహకరిస్తా.

ఉపాధి నిధులివ్వాలి
ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి



2014-19 మధ్యకాలంలో నా నియోజకవర్గంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు జరగాల్సి ఉంది. దీనిపై ప్రధానంగా దృష్టి పెట్టండి. తల్లికి వందనం పథకంలో అధిక విద్యుత్ వినియోగం వంటి కారణాలతో అర్హులైన వారికి వర్తింపుచేయడం లేదు. ఇది సరికాదు.

అటవీశాఖ అడ్డుకుంటోంది ..
కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్



కొల్లేరు గ్రామాల్లో అభయారణ్యం పేరుతో అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మౌలిక సదుపాయాలైన రోడ్లు, తాగునీటి సరఫరాను అటవీశాఖ అడ్డుకుంటోంది. సొసైటీల్లో కౌలురైతులకు ఎరువులు ఇవ్వడం లేదు. పెద్దఎడ్లగాడి వద్ద ఉప్పుటేరులో తూడు,గుర్రపు డెక్క అడ్డుపడుతున్నాయి. కొల్లేరుకు ముంపు ప్రమాదం పొంచి ఉంది.

నకిలీ విత్తనాల బారిన రైతులు
పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేసేవారు తయారయ్యారు. అమాయకులైన రైతుల బలి కాకుండా చర్యలు తీసుకోవాలి. సత్య సాయి తాగునీటి పథకం కింద గిరిజన గ్రామాలకు తాగునీరు అందించాలి. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్య, రవాణా సౌకర్యాలను విస్తరించాలి.

నారాయణపురం బ్రిడ్జిని పూర్తిచేయండి
ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు



నారాయణపురం బ్రిడ్జి నిర్మాణపు పనులు మరింత వేగవంతం చేయాలి. ఇప్పటికే పనులు సాగుతున్నా ప్రజా అవసరాల దృష్ట్యా మరింత వేగం పెంచాలి. ఈ బ్రిడ్జి పూర్తిఅయితే రెండు జిల్లాల ప్రజలకు ఉపయోగ కరంగా ఉంటుంది.

తెలంగాణ హద్దుల్లోను ఉచితం రావాలి
చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్



తెలంగాణ సరిహద్దులో నా నియోజకవర్గం ఉంది. ఇక్కడ అంతర్ రాష్ట్ర సర్వీసుల్లో ఉచితబస్సు ప్రయాణం అమలు కావడం లేదు. సరిహద్దు ప్రాంతాల్లో కూడా ఆర్టీసీలో ఉచిత ప్రయాణాలకు అవకాశం ఇవ్వండి. ఉపాధి హామీ పథకం కింద రావాల్సిన పెండింగ్ బకా యిలను విడుదలయ్యేలా సహకరించండి.



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన సత్యనారాయణరాజు

మీ నమ్మకం నిలబెడతా
సీఎం కార్యక్రమాల సమన్వయకర్త పాందువ్వ శ్రీను

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పార్టీ తనకు అప్ప గించిన బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తానని, మీ నమ్మకం నిలుపుతానని తాజాగా సీఎం కార్యక్రమాల సమన్వయకర్తగా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్య నారాయణరాజు (పాందువ్వ శ్రీను) సోమవారం సీఎం చంద్రబాబును కలిసినప్పుడు ప్రమాణం చేశారు. పార్టీ వ్యవహారాల్లో ఇప్పటివరకు తనకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని, ఇలా ప్రతీసారి నాకు అప్పగించిన అన్ని పనులను సమర్థవంతంగా పూర్తి చేసిన విషయాన్ని ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు.

91 మంది దివ్యాంగుల పెన్షన్ల రద్దు

ముదినేపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలో రీవెరిఫికేషన్‌లో అనర్హులుగా గుర్తించిన 91 మంది దివ్యాంగుల పెన్షన్లు రద్దు చేస్తూ ఎంపీడీవో వై.రామకృష్ణ సోమవారం నోటీసులు జారీ చేశారు. అంగవైకల్యం 40 శాతం కంటే తక్కువ ఉన్నట్లు వైద్యులు నిర్ధారించి తాజాగా జారీ చేసిన ధ్రువీకరణ పత్రాల ఆధారంగానే నోటీసులు జారీ చేశామని ఎంపీడీవో తెలిపారు. సదరం సర్టిఫికెట్ ఆధారంగా వీరు దివ్యాంగులుగా పరిగణించబడరని నిర్ధారిస్తూ అనర్హులుగా గుర్తించి పింఛన్‌ను రద్దు చేస్తున్నట్టు నోటీసుల్లో పేర్కొన్నారు.

30 ఫిర్యాదులు స్వీకరణ

ఏలూరు క్రైం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేసి పారదర్శకంగా చట్ట ప్రకారం న్యాయం చేస్తామని ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఆయనతో పాటు ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు 30 మంది ఫిర్యాదుదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు అప్పటికప్పుడే ఫోన్‌లో జారీ చేశారు. ప్రజలు తమ సమస్యలపై సమీపంలో ఉన్న సీఐ, డీఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని లేదంటే వెబ్‌సైట్ https://meekosam.ap.gov.inలో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

బస్సులు కిటకిట

- ఉచిత ప్రయాణంతో మహిళలకు విశేష లబ్ధి
- రోజు రోజుకు పెరుగుతున్న మహిళలు
- కళాశాల విద్యార్థినుల ఆనందం

■ లోపలి పేజీలో..



ఆపరేషన్ ట్రేస్..

- అదృశ్యమైన వారి ఆచూకీ కోసం పోలీసుల ప్రత్యేక డ్రైవ్
- ఇప్పటి వరకు 13 మంది గుర్తింపు
- మిగిలిన కేసుల కోసం దర్యాప్తు వేగవంతం
- తెలియాల్సి ఉన్న 178 మంది ఆచూకీ

■ లోపలి పేజీలో..




లక్ష్మీపురం యాగశాలలో అంకురార్పణ, మూలవిరాట్ నారసింహుడు

శ్రీనివాసుడి పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పురాతన లక్ష్మీపురం ఆలయంలో శ్రీనివాసుని దివ్య పవిత్రోత్సవాలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయంలో అర్చకులు వేదమంత్రోచ్ఛరణ నడుమ యాగశాలలో అంకురార్పణ నిర్వహించారు. ముందుగా పుట్టమన్ను తెచ్చి పాలికల్లో పోశారు. అనంతరం డోలు, సన్నాయి వాయిద్యాల నడుమ నవధాన్యాలను పాలికల్లో ఉంచారు.

నేటి నుంచి లక్ష్మీనారసింహుని పవిత్రోత్సవాలు

సుందరగిరిపై శ్రీలక్ష్మీనారసింహుని దివ్య పవిత్రోత్సవాలు మంగళవారం నుంచి మూడు రోజుల దివ్య పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. పురాణ ప్రాశస్త్యం కల్గిన ఆలయం శ్రీవారి ప్రధాన ఆలయానికి దత్తత దేవాలయంగా మండలంలోని ఐఎస్ జగన్నాధపురంలో విరాజిల్లుతోంది. ఏటా ఇక్కడ కల్యాణ మహోత్సవాలు, మహాశివరాత్రికి సుదర్శన మహాహోమాన్ని నిర్వహించడం పరిపాటి. తాజాగా పవిత్రోత్సవాలు జరిపేందుకు దేవస్థానం నిర్ణయించింది.

- 19న ఉదయం మహాగణపతి పూజ, పుణ్యాహవచన, ఋత్విగ్వరణ, దీపారాధన, మండపారాధన, అంకురార్పణ, అధివాసాలు, నీరాజన మంత్రపుష్పాలు జరుగుతాయి.
- 20న నిత్యహోమం, బలిహరణ, మూలమంత్రహోమాలు, అభిషేకాలు, పవిత్రారోపణ. జరుగనున్నాయి.
- 21న మహాశాంతి హోమం, పౌష్టిక హోమం, శ్రీమహాపూర్ణాహుతి హోమం, పవిత్రవిసర్జన, శాంతికల్యాణంతో పవిత్రోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.




పెనుగొండ వాసవి శాంతి ధామ్‌లో ప్రత్యేక పూజలు

వాసవి శాంతి ధామ్‌లో దంపతీ పూజలు

పెనుగొండ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం బరంపూర్ నుంచి వచ్చిన 40 మంది దంపతులు పెనుగొండ వాసవి శాంతి ధామ్‌లో సోమవారం దంపతీ పూజలు నిర్వహించారు. మహారాష్ట్ర నాందేడ్ నుంచి వచ్చిన 45 మంది దంపతులు శివారాధన, దంపతీ పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రాష్ట్రంలో పెరిగిన సైబర్ మోసాలు

ఎంపీ మహేశ్ ప్రశ్నతో కేంద్రమంత్రి పంకజ్ వెల్లడి

ఏలూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2020 నుంచి బ్యాంకింగ్ రంగంలో సైబర్ నేరాలు భారీగా పెరిగాయని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి వెల్లడించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నపై లోక్‌సభలో కేంద్ర మంత్రి లిఖితపూర్వక జవాబిచ్చారు. 2020 నుంచి ఐదేళ్లలో బ్యాంకింగ్ సైబర్ మోసాల విలువ రూ.132.97కోట్లు అని మంత్రి తెలిపారు. 2020లో 36, 2021లో 59, 2022లో 66, 2024లో 82 సైబర్ నేరాలు నమోదయ్యాయని తెలిపారు. సైబర్ భద్రతపై ఆర్‌బీఐ సైబర్ సెక్యూరిటీ, ఐటీ రిస్క్‌గ్రూప్ (సీఎస్ఐటీఈ) నిరంతరం పర్యవేక్షణ చేస్తుందన్నారు. సైబర్ భద్రతా చట్టాన్ని బలోపేతం చేయడానికి వివిధ సర్క్యులర్లు, మార్గదర్శకాలను ఆర్‌బీఐ జారీ చేస్తోందని మంత్రి తెలిపారు. ఎంప్యానెల్ చేయబడిన 200 సంస్థల ద్వారా ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ వివిధ సంస్థల కంప్యూటర్ సిస్టమ్‌లు, నెట్‌వర్కులు, వైబ్‌సైట్‌లు, క్లౌడ్ అప్లికేషన్‌లను నిరంతరం ఆడిటింగ్ చేస్తోందన్నారు.



భీమవరంలో కొవ్వొత్తుల ర్యాలీలో కనుమూరి బాపిరాజు, నేతలు

ఓట్ల చోరీపై కాంగ్రెస్ నిరసన

భీమవరం టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ ఆదేశాలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పాతపాటి హరికుమార్ రాజు ఆధ్వర్యంలో ఓటు చోర్- గద్దె చోర్ అనే నినాదంతో సోమవారం సాయంత్రం భీమవరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీతో పాటు కొన్ని రాష్ట్రాల్లో గద్దెనెక్కిన ప్రభుత్వాలు గత ఎన్నికల్లో ఓట్ల చోరీకి పాల్పడ్డాయని నాయకులు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, ఏడు నియోజకవర్గాల కోఆర్డినేటర్లు, మహిళా కాంగ్రెస్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న రాధా మనోహరదాస్



ఆలయ వేదపండితులతో రాధా మనోహరదాస్

ద్వారకాతిరుమల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని సోమవారం రాత్రి ఆధ్యాత్మిక వేత్త, ప్రవచనకర్త రాధా మనోహరదాస్ సందర్శించారు. హిందూత్వ వాదమే ధ్యేయంగా ప్రతీ ఒక్కరికీ చైతన్యం కలిగించడమే లక్ష్యంగా అందరికీ సుపరిచితుడైన ఆయన ద్వారకాతిరుమల ఆలయంలోకి అడుగు పెట్టగానే పలువురు భక్తులు ఆసక్తిగా తిలకించారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించడం ఎంతో తనకు ఆనందాన్ని ఇచ్చిందన్నారు.

25 నుంచి స్మార్ట్ రేషన్‌కార్డులు

పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల

ఏలూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డులను ఈనెల 25 నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. పంపిణీకి సర్వం సిద్ధం చేశామని, నియోజకవర్గాల వారీగా అందరికీ అందేలా చూస్తామన్నారు. జిల్లా కేంద్రం ఏలూరులో సోమవారం జరిగిన డీఆర్‌సీ సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం కొత్త ఆలోచనలతో రూపొందించిన స్మార్ట్ కార్డులు ఏటీఎం కార్డు సైజులో ఉండేలా ఏర్పాటు చేశామని, వీటిని లబ్ధిదారులందరికీ అందించబోతున్నట్లు చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకం కింద నమోదుకాని రైతుల ఎవరైనా ఉంటే ఈ నెల 20లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో రైతాంగానికి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించామని మంత్రి నాదెండ్ల అన్నారు. జిల్లాలో యూరియా, డీఏపీ కొరత లేదని స్పష్టం చేశారు.



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్త్రీశక్తి పథకంలో మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం ద్వారా విశేష లబ్ధి చేకూరుతోంది. పథకం ప్రారంభించిన నాటి నుంచి రోజు రోజుకు ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. రద్దీకి అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అదే సమయంలో సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో బస్టాప్‌ల వద్ద బస్సులు ఆగకుండా వెళ్లిపోతున్నాయి. పోలవరం ప్రాంతంలో బస్సులు మరమ్మతులతో నిలిచిపోతున్నాయి. తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో పలు సమస్యలతో కండక్టర్‌తో మహిళలు వాగ్వాదానికి దిగుతున్నారు. తెలంగాణ పరిధి గ్రామంలో బస్సు ఎక్కిన ఇక్కడి మహిళలు టికెట్ తీసుకోవాల్సిందేనని కండక్టర్లు చెప్పడంతో సమస్యలు వస్తున్నాయి.



బస్సులు కిటకిట

- ఉచిత ప్రయాణంతో మహిళలకు విశేష లబ్ధి
- రోజు రోజుకు పెరుగుతున్న మహిళలు
- కళాశాల విద్యార్థినుల ఆనందం
- బస్టాప్‌లలో ఆగని బస్సులు
- రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో వివాదాలు
- పలుచోట్ల మరమ్మతులతో నిలిచిన బస్సులు

భీమవరం టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులలో సోమవారం అనూహ్య రద్దీ కనిపించి. గత మూడు రోజులుగా కంటే కిక్కిరిసిన ప్రయాణికులతో బస్సులు వెళ్లాయి. పల్లె వెలుగు అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులల్లో ఉచిత ప్రయాణం మహిళలకు విశేషంగా లాభిస్తోంది. మూడు రోజులుగా పశ్చిమ గోదావరి జిల్లాలో 2,70,858 మంది ప్రయాణించారు. టిక్కెట్‌పై 1,65,042 మంది ప్రయాణించగా 1,05,816 మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు. మూడు రోజులకు ఆర్టీసీకి టిక్కెట్ ఆదాయం రూ. 88,96,713 అయితే రూ.36,37,510 ఉచిత ఫేర్ టిక్కెట్ విలువ కావడం విశేషం.



బస్ కాంప్లెక్స్‌లలో రద్దీ

భీమవరం పట్టణంతో పాటు జిల్లాలో పలు బస్ కాంప్లెక్స్‌లు సోమవారం ఉదయంనుంచి రద్దీగా కనిపించాయి. విద్యార్థులతోపాటు వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు అధికంగా కనిపించారు. మహిళలు సంఖ్య కూడా బాగా పెరిగింది. బస్సులు ప్లాట్ ఫారం వద్ద పెడితే చాలు క్షణంలో ఫుల్ అయిపోతోంది. మార్గమధ్యలో ప్రయాణికులను ఎక్కించుకునే పరిస్థితి ఉండడం లేదు. సాయంత్రం వరకు ఇదే పరిస్థితినెలకొంది.

అధికారుల పరిశీలన

బస్ కాంప్లెక్స్‌లలో ప్రయాణికుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. బస్సులను సక్రమంగా పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సాయంత్రం వేళ విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా బస్సులను పంపించేలా చర్యలు చేపట్టారు.

బస్సులు ఏర్పాటుచేయాలి

ఆకివీడు: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీ బస్టాండ్‌లు, బస్సులు కళకళలాడుతున్నాయి. గతంలో మహిళ అధికంగా ఆటోలో వెళ్లేవారు. స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీలో ఉచితంగా వెళ్లేందుకు అవకాశం కల్పించడంతో ఆర్టీసీ బస్టాండులకు చేరుతున్నారు. మహిళలు, కళాశాల విద్యార్థులు ఉచిత ప్రయాణంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆకివీడు బస్టాండ్‌లో కంట్రోలర్‌ను ఏర్పాటు చేశారు. ఆకివీడు నుంచి గుడివాడ, విజయవాడ వెళ్లేందుకు బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మహిళా ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్టీసీ ఉన్నతధికారులు సమస్యను

ఆపండి..

పోలవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉచిత ఆర్టీసీ ప్రయాణం మహిళలు విరివిగా వినియోగిస్తున్నారు. సోమవారం చాలా చోట్ల బస్సులలో మహిళా ప్రయాణికుల రద్దీ పెరిగింది. రద్దీ అధిగమించడానికి బస్సులను నిర్దేశిత ప్రాంతాలలో నిలపకుండా బస్టాప్‌లకు కొద్దిపాటి దూరంలో ఆపి ప్రయాణికులను దించి వెళుతున్నారు. మహిళలు, సాధారణ ప్రయాణికులు సైతం ఆర్టీసి సిబ్బంది తీరుపై మండిపడుతున్నారు. పోలవరం నుంచి సోమవారం బయల్దేరిన రాజమహేంద్రవరం డిపో బస్సు తాళ్లపూడి మండలం ధర్మవరంలో మరమ్మతులకు గురై నిలిచిపోయింది. జోరున కురుస్తున్న వర్షంలో ప్రయాణికులు బస్సులు, ఆటోల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. రాజమహేంద్రవరం నుంచి పోలవరం బయల్దేరిన బస్సు కొవ్వూరు బస్టాండులో నిలిచిపోవడంతో ప్రయాణికులను దింపి మరమ్మతులు చేశారు.

సరిహద్దు గ్రామాల్లో ఉచితం వర్తించదా?

చింతలపూడి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఎక్కడికైనా ఉచిత ప్రయాణం చేయవచ్చు. కానీ తెలంగాణ-ఆంధ్ర సరిహద్దు మండలాల్లో మాత్రం అడ్డంకులు ఎదురవుతున్నాయి. సరిహద్దు గ్రామాల మహిళలు ఆంధ్రా ప్రాంతంలో తిరిగినా ఉచితం వర్తించదని కండక్టర్లు చెప్పడంతో మహిళలు వాగ్వివాదానికి దిగుతున్నారు. ఏలూరు డిపోకు చెందిన బస్సు సోమవారం ఉదయం సత్తుపల్లి వెళ్లి గురుభట్లగూడెం రాగా అక్కడ కొందరు మహిళలు చింతలపూడి మండలంలోని మల్లాయిగూడెం రావడానికి బస్సు ఎక్కారు. మీకు ఈ బస్సు వర్తించదంటూ చెప్పడంతో ప్రభుత్వం ఇచ్చినా మీరు అడ్డుపడడం సరికాదని మహిళలు కండక్టర్‌తో వాగ్వివాదానికి దిగారు. మల్లాయిగూడెం గ్రామానికి చెందిన నాయకుడు మట్టా సత్యనారాయణ ఇది ఏలూరు డిపోకు చెందిన బస్సు ఆంధ్రా ప్రాంతంలోని గ్రామాలకు వెళ్లడానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించినా వీల్లేదంటూ మహిళలకు రూ.20 టికెట్ కొట్టడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకానికి కండక్టర్లు అడ్డుపడడం సరికాదని వ్యాఖ్యానించారు. పల్లె వెలుగు సర్వీసు అయిన తెలంగాణ-ఆంధ్ర మధ్య రాకపోకలతో అంత రాష్ట్ర సర్వీసుగా భావిస్తున్నారనుకుంటే అదే బస్సులో చింతలపూడి నుంచి ఏలూరుకు ఉచిత టికెట్ ఇవ్వడం గమనార్హం. ఒకే మండలంలో వేర్వేరు గ్రామాల్లో ఉచిత టిక్కెట్‌పై ద్వంద్వ విధానాలతో ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. గురుభట్లగూడెం నుంచి మల్లాయిగూడెం గ్రామానికి డబ్బు చెల్లించాల్సిందేనని చెప్పడం విడ్డూరంగా ఉందని మహిళలు వాపోయారు. ఇదే సంఘటన తిరిగి మధ్యాహ్నం వేళ మరో ఏలూరు డిపోకు చెందిన బస్సు కండక్టర్ పోతునూరు నుంచి లింగగూడెం గ్రామం వెళ్లేందుకు మహిళలకు అభ్యంతరం వ్యక్తం చేశారు. సరిహద్దులోని గ్రామాలకు ఈ ఉచిత ప్రయాణం వర్తించదా? ఉన్నతాధికారులు ఈ సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. అసలే చింతలపూడి మండలంలో మూడు వంతులు గ్రామాలకు బస్సు సర్వీసులు లేవు. వచ్చే బస్సులు సగం తెలంగాణ ప్రాంతానివి. ఉన్న ఈ కొద్ది బస్సుల్లో కూడా మహిళలకు అవకాశం లేకపోవడం విచిత్రంగా ఉందని వాపోయారు.

వరిని కాపాడుకుందాం

వర్షాలతో వేలాది ఎకరాల్లో వరి చేలు నీట మునిగాయి. ఉమ్మడి జిల్లాలో వరి పంట వివిధ దశల్లో ఉంది. డెల్టా ప్రాంతంలో కొన్ని చోట్ల పిలక దశకు చేరితే మరికొన్ని చోట్ల ఇంకా నాట్లు వేస్తున్నారు. మెట్ట ప్రాంతంలో దాదాపు అన్ని చోట్ల పిలక దశకు చేరుకుంది. అల్పపీడన ప్రభావంతో అన్ని చోట్ల నీట మునగడంతో రోజుల తరబడి నీటిలో నానుతోంది. పలు ప్రాంతాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు నీట మునిగిన వరి పంటను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు.

- వర్షాలతో నీట మునిగిన వరి చేలు
- పరిశీలించిన శాస్త్రవేత్తలు.. రైతులకు సూచనలు




నీట మునిగిన వరిని పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

పెనుమంట్ర/అత్తిలి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం అధిక వర్షాలతో పల్లపు ప్రాంతాలలో వరి చేలు ఊడ్చిన దశ నుంచి పిలకలు దశలో నీట మునిగాయి. నీట మునిగిన చేలను పలుచోట్ల పరిశీలించినట్లు మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంచాలకులు టి.శ్రీనివాస్, ప్రధాన శాస్త్రవేత్త ఎం.గిరిజా రాణి తెలిపారు. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన ఎంటీయూ 1318, స్వర్ణ, సంపద స్వర్ణ, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064 రకాలు ఐదు రోజుల వరకు ముంపును తట్టుకుంటాయని వారు వివరించారు

- పంట ఊడ్చిన వెంటనే నీట మునిగి మొక్కలు చనిపోతే మనేదలు వేసుకోవాలని సూచించారు.
- నారుమడి లేక ఎద పద్ధతిలో నారుమడిలో విత్తనం మూడు కన్నా ఎక్కువ శాతం నీట మునిగితే మొలక గణనీయంగా తగ్గుతుంది. వీలైనంత త్వరగా నీరు బయటకు తీసి పొలం ఆరగట్టాలి.
- నారు మడి పూర్తిగా దెబ్బతింటే అందుబాటులో ఉన్న స్వల్పకాలిక రకాలతో మరలా తిరిగి విత్తుకోవాలి.
- విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారు 5 రోజుల కన్నా ఎక్కువ మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉంది.
- నీట మునిగిన నారు మడి నుంచి వీలైనంత తొందరగా నీటిని బయటకు పంపించాలి. తర్వాత 5 సెంట్ల నారుమడికి 1.0 కిలోల యూరియా, 1.0 కిలో పొటాష్ వేసుకోవాలి
- తెగుళ్ల నివారణకు లీటరు నీటికి 1.0 గ్రా. కార్బండజిమ్ లేదా 2.0గ్రా కార్బండజిమ్, మాంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పిలకల దశలో సాధారణ రకాలు 5 రోజుల వరకు ముంపును తట్టుకుంటాయి. ఎంటీయూ 1064, పీఎల్‌ఏ 1100 వంటి రకాలు వారం రోజుల వరకు మునక తట్టుకుంటాయి. ఆకులు పైకి కనిపిస్తూ 30-40 సెంటీ మీటర్ల నీరు నిలబడే పల్లపు ప్రాంతల్లోని మధ్యస్థ ముంపును కూడా తట్టుకుంటాయి.
- ఎంటీయూ 1232రకం 10 నుంచి 12 రోజుల పాటు తాత్కాలిక ముంపును కూడా తట్టుకుంటుంది.
- పిలకలు కట్టే దశలో నీట మునిగిన వరి పొలం త్వరగా పుంజుకోవడానికి, వీలైనంత త్వరగా నీటిని తీసివేసి ఎకరానికి 20 కిలోల యూరియా, 10-15 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలి.

వర్షం.. విద్యుత్ షాక్

ఈ సూచనలు పాటించండి



ఏలూరుసిటీ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి. షార్టేజ్ ఉన్న చోట్ల విద్యుదాఘాతం ప్రమాదం పొంచి ఉంటుంది. వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏపీఈపీడీసీఎల్ ఏలూరు జిల్లా ఎస్ఈ పి సాల్మన్‌రాజు తెలియజేశారు.

- వర్షపువేళ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు, ఇతర పరికరాలు దగ్గర గుమికూడవద్దు.
- తడి చేతులతో ఎలక్ట్రిక్ స్విచ్ ఆన్/ఆఫ్ చేయకండి.
- ఇళ్లలో తడి నేలపై విద్యుత్ తీగలు , పరికరాలు పడకుండా జాగ్రత్తపడాలి.
- వర్షాకాలంలో ఇంటి వద్ద ఇనుపరాడ్లు , సిమ్మెంట్ రాడ్లు , టీన్ షీట్లు వంటివి బహిరంగ ప్రదేశాల్లో ఉంచకండి.
- ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడి ఉంటే వాటిని తాకవద్దు, వెంటనే 1912 నెంబర్‌కి సమాచారం అందించాలి.
- తెగిపడిన విద్యుత్ తీగలు, పరికరాలు కనిపిస్తే 1912 నంబర్‌కు సమాచారం ఇవ్వాలి.
- ఇళ్లలో విద్యుత్ పరికరాలు వాడిన తర్వాత స్విచ్ ఆఫ్ చేయటం అలవాటు చేసుకోండి.
- వర్షపు నీటితో నిండిన ప్రదేశాల్లో, పొలాల్లో, రోడ్లలో ఉన్న విద్యుత్ లైన్ల దగ్గర తిరగవద్దు.
- విద్యుత్ తీగలు, స్థంభాల దగ్గర గుడారాలు, షెడ్‌లు, టెంట్లు వేయకూడదు.
- పిల్లలు, విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఆడకూడదు.
- వర్షాకాలంలో ఇంటి లోపలికి వచ్చే కరెంట్‌షాక్‌లను నివారించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి .
- ఇంటిలో ఫ్యూజ్ లైన్లు సరిగ్గా ఉన్నాయో లేదో తనిఖీ చేసుకోవాలి.
- తడి బట్టలు, తడి చేతులతో విద్యుత్ తీగలు, స్విచ్‌లపను తాకవద్దు.
- వర్షాకాలంలో మోటార్ వాడకం తగ్గించాలి. .
- విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు కాల్ చేయాలి.

చికెన్ ధర పెరిగింది




తణుకు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): చికెన్ ధరలు స్వల్పంగా పెరిగాయి. వారం రోజులు నుంచి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. కేజీకి రూ.15 పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం కిలో రూ.200 నుంచి రూ. 240 పెరిగింది. రానున్న రోజుల్లో ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. మరో పక్క చిన్న రైతుల వద్ద కోళ్ల లేకపోవడం, పెద్ద కంపెనీల వద్ద కోళ్ల ఉండడం వల్ల వారికి అనువుగా ధరలు పెంచడం, తగ్గించడం చేస్తున్నారు. చిన్న రైతులు బ్రాయిలర్ వేసినా కార్పోరేట్ కంపినీలు దెబ్బకు తట్టుకోలేకపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా రోజు 80 వేల కేజీలు అమ్ముడవగా ఇపుడు 40 నుంచి 50వేల కేజీలు విక్రయిస్తున్నారు. తణుకు ప్రాంతంలో 30వేలు కేజీలు విక్రయాలు జరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

చిన్న రైతుకు తప్పని నష్టం

ఉమ్మడి జిల్లాలో బ్రాయిలర్ కోళ్ల పెంచే చిన్న రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ప్రస్తుతం కోడి లైవ్ కేజీ రూ.70. కనీసం రూ.90 ఉంటే కాని రైతుకు గిట్టుబాటు కాదు. ధరకోసం చూస్తే మేత, ఇతర ఖర్చులు భారం. ఆదాయం రాక రైతులు నష్టపోతున్నారు.

కంపెనీల వద్ద కోళ్ల అందుబాటులో ఉంటాయి. కంపెనీల వద్ద కోళ్ల ఉన్న సమయంలో రైతులు వద్ద కోళ్ల ఉండవు. కాబట్టి కంపెనీలు ధరలు వారికి అనుకూలంగా లాభాలు వచ్చేవిదంగా ధరలు నిర్ణయించుకుంటారు. పోయిన నష్టాలను రాబట్టుకుంటారు. రైతుకు మాత్రం నష్టం తప్పదు.

మార్కెట్ రేటును బట్టి విక్రయాలు



మార్కెట్‌లో చికెన్ ధరను బట్టి వినియోగదారులకు విక్రయిస్తాం. వారం రోజులు నుంచి స్వల్పంగా ధరలు పెరిగాయి. రానున్న వారం రోజులు ఇదే మాదిరిగా ఉండే అవకాశం ఉంది. వినాయక, దశమి ఉత్సవాల నాటికి ధర పెరగవచ్చు. తర్వాత కార్తిక మాసం మరలా తగ్గుముఖం పడుతుంది. ఇలాంటి ఒడుదుడుకులు తట్టుకునే రైతులు లేరు. పెద్ద కంపెనీల చేతిలో వ్యాపారం సాగుతుంది.

చిలుకూరి సత్యనారాయణ, వ్యాపారి, తణుకు

రొయ్య రైతుకు ఊరట

స్వల్పంగా పెరిగిన ధర



గణపవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో వనామి రొయ్యల ధరలు స్వల్పంగా పెరిగాయి. అమెరికా సుంకాల ప్రభావంతో గత 15రోజుల క్రితం ధర అమాంతం పడిపోయింది. వంద కౌంట్ ధర రూ.270 నుంచి 220కి దిగజారడం, కొనుగోలు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందారు. అమెరికాకు 20, 30, 40, 50 కౌంట్ రొయ్యలు మాత్రమే ఎగుమతి చేస్తారు. చిన్నరొయ్యలు అధికంగా చైనా, వియత్నాం, తదితర దేశాలకు ఎగుమతి చేస్తారు. వీటిపై సుంకాల భారం పడదు. అయినా ఎగుమతిదారులు, వ్యాపారులు రొయ్యల ధరలు తగ్గించేయడంతో రొయ్య సాగుదారులు ఆందోళన చెందారు. ఉత్పత్తి తక్కువగా ఉండడం, ఇతర కారణలతో వనామి రొయ్యలదరలు తిరిగి స్వల్పపెరుగుదల రైతులకు ఊరటనిచ్చింది. ఇటీవల క్రాప్ హాలిడే ప్రకటించాలనుకున్న రైతుల్లో ధరలు తిరిగి పునరావృతం అవడంతో సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. 100కౌంట్ రొయ్యలకు గతంలో కంటే ప్రస్తుతం 45రూపాయల వరకు పెరిగిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

వారి దాతృత్వాన్ని మరువలేం

- లక్ష్మీపురంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి నిర్మాణానికి

కోట్ల రూపాయల విరాళం

దెందులూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):'ఎంత ఎత్తుకు ఎదిగినా వారు పుట్టిన ఊరిని మర్చిపోలేదు. పేదల కంటి సమస్యల పరిష్కారానికి కోట్ల రూపాయలు విరాళం ఇచ్చి స్వగ్రామంలో ఎల్‌వి ప్రసాద్ కంటి ఆసుపత్రిని నిర్మిస్తున్నారు. నిజంగా వారి దాతృత్వాన్ని మరువలేం. ఊరిపైన, పేదలపైన వారికున్న మమకారానికి కృతజ్ఞతలు' అని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కొనియాడారు. 2027 నాటికి అందుబాటులోకి రానున్న ఈ ఆసుపత్రికి కాసరనేని పరిపూర్ణ లక్ష్మీ నేత్ర సంరక్షణా కేంద్రంగా నామకరణం చేశారు. పెదవేగి మండలం వంగూరు లక్ష్మీపురంలో కంటి ఆసుపత్రి నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యేలు చింతమనేని, బడేటి చంటి, కామినేని శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ, గద్దే రామ్మోహన్, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం, దాత కాసరనేని దమయంతి, ఐఏఎస్ అధికారి రాజు దంపతులు భూమి పూజ చేశారు. డాక్టర్ ప్రశాంత్ గార్గే మాట్లాడుతూ మొదట కంటి ఆసుపత్రిని నిర్మిస్తామని, రెండో విడత కంటి సమస్యల నివారణకు చికిత్సతోపాటు హోం కేర్ సేవలకు, మూడో విడతలో అంధత్వ నిర్మూలనకు, అంధుల జీవనోపాధికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏలూరు ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఏలూరు, దెందులూరు నియోజకవర్గాల దగ్గరలో ఆసుపత్రి ఏర్పాటు చేయడం ద్వారా పేదల కంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు. దాతలు దమయంతి, రాజు దంపతులు, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు, ఎన్ఆర్ఐ వాణీ శ్రీరామ్, వంశీ మొక్కజొన్న సీడ్స్ సంస్థల అధినేత ఆర్.రామారావు, కాసరనేని సాగర్‌ను నేతలు అభినందించారు. కాంగ్రెస్ పార్టీ జార్ఖండ్ రాష్ట్ర ఇన్‌చార్జ్ కె.రాజు, ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ గారపాటి రామసీత, ఆలపాటి నరసింహమూర్తి సర్పంచ్ రూతు జోసఫ్, వెంకట్రావు, టీడీపీ మండల అధ్యక్షులు ఈడ్పుగంటి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్కూల్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, కలెక్టర్ నాగరాణి

రూ.10 కోట్లతో చదువుల భవనం

- విద్యారణ్య భారతీయ కేంద్రానికి అప్పగింత
- దాతల సేవలు అభినందనీయం : కేంద్ర మంత్రి వర్మ

మొగల్తూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):తీర ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడానికి దాతల కృషి అభినందనీయమని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. పేరుపాలెంలో 2.30 ఎకరాల విస్తీర్ణంలో రూ.10 కోట్లతో గన్నాబత్తుల వెంకటప్రసాద్ నందిని దంపతులు నిర్మించిన భవనాన్ని విశాఖలోని విద్యారణ్య భారతీయ విద్యా కేంద్రానికి సోమవారం అప్పగించారు. ఈ కార్యక్రమంలో వర్మ మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో అన్ని సదుపాయాలతో సీబీఎస్ఈ సిలబస్‌తో కూడిన 30 తరగతి గదులతో స్కూల్ భవనాన్ని నిర్మించడం స్ఫూర్తిదాయకం అన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ దాతల స్ఫూర్తితో తీర గ్రామాల ప్రజలంతా విద్యా సంస్థను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి, వినాయక విగ్రహాలకు పూల మాలలు వేసి జ్యోతిని వెలిగించి పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యేలు బండారు మాధవనాయుడు, కొత్తపల్లి జానకిరామ్, మాజీ సర్పంచ్ మేళం బన్ను, దాత గన్నాబత్తుల వెంకట ప్రసాద్ నందిని, కుటుంబ సభ్యులు పునీత్, అర్చన, రక్షిత్, సాయిప్రియ, విశాఖకు చెందిన భారతీయ విద్యా కేంద్ర యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి ఒడిశాలో నేవీ క్యాంప్

- నరసాపురం 7వ ఆంధ్రా యూనిట్ నిర్వహణ
- తెలుగు రాష్ట్రాల నుంచి 100 మంది క్యాడెట్స్



బోటు సిద్ధం చేస్తున్న నేవల్ అధికారులు

నరసాపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని చిలుక నేవల్ బేస్‌లో సెప్టెంబరు 1 నుంచి 10 వరకు నరసాపురం 7వ ఆంధ్రా యూనిట్ ఆధ్వర్యంలో సెయిలింగ్ బోటింగ్ సాహస యాత్ర నిర్వహిస్తున్నారు. ఈ యాత్రలో తెలుగు రాష్ట్రాల నుంచి 100 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొననున్నారు. యూనిట్ కమాండర్ సంజిత్‌రౌత్రే, డిప్యూటీ క్యాంపు కమాండర్ అనిల్‌యాదవ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పట్టణంలోని కాటన్‌పార్కు వద్ద నేవల్ యూనిట్‌లో సోమవారం బోట్లను సిద్ధం చేస్తున్నారు. వీటిని ఒడిశాకు తరలించనున్నారు. ఈ సాహస యాత్రలో పాల్గొనే క్యాడెట్లకు బోటింగ్, సిమ్మింగ్, ఫైరింగ్, డ్రిల్ తదితర అంశాలపై శిక్షణ ఇవనున్నట్లు కమాండర్ రౌత్రే చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లోని నేవీ యూనిట్లు వివిధ పరీక్షలు నిర్వహించి ఎంపిక చేసిన క్యాడెట్లు పది రోజుల పాటు ఒడిశాలో క్యాంపులో శిక్షణ పొందనున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ క్యాంపుకు 16 మంది ట్రైనర్లు, 12 మంది ఇతర సిబ్బంది హాజరుకానున్నట్లు నరసాపురం నేవీ యూనిట్ కార్యాలయం వెల్లడించింది.



రైతులకు ఎరువులు అందిస్తున్న విప్ నాయకర్, షరీఫ్, నేతలు

ఉమ్మడి పశ్చిమలో ఎరువుల కొరత లేదు

- డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ

నరసాపురం టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమలో ఎరువుల కొరత లేదని, డీసీఎంఎస్ ద్వారా రైతులకు చిరు ధాన్యాలు, ఆక్వా సీడ్‌ను తక్కువ ధరకు అందిస్తామని డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ అన్నారు. పీచుపాలెంలో పురుగులు, ఎరువుల, మేత దుకాణాన్ని ప్రభుత్వ విప్ నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ప్రభుత్వ మైనార్టీ సలహాదారు ఎంఏ షరీఫ్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఆక్వా రైతులకు నాణ్యమైన సీడ్‌ను అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. తక్కువ ధరకు సీడ్ అందించి జిల్లాలో ఆక్వా ఉత్పత్తులు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. నిడదవోలులో రైస్‌మిల్లు నిర్మాణంతో పాటు జనరిక్ షాపు కూడా త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. మత్స్యకార అభివృద్ధి చైర్మన్ కొల్లు పెద్దిరాజు, చాగంటి పార్థసారథి, కలవకొలను తాతాజీ, కొండేటి రామకృష్ణ, వాతాడి ఉమా, అందే నరేన్, మైలా వసంతరావు, సంకు భాస్కర్, మల్లాడి మూర్తి పాల్గొన్నారు.

భారం మోయలేం..



కిరాయిలు లేక లారీ స్టాండ్‌లో నిలిచిపోయిన టిప్పర్లు, లారీలు

- ఉనికిని కోల్పోతున్న టిప్పర్ లారీలు
- కిరాయిలు లేక విలవిల్లాడుతున్న యజమానులు
- నెల వారీ ఖర్చులకూ అప్పులేనంటున్న యజమానులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో టిప్పర్ లారీలు కిరాయిలు లేక ఉనికి కోల్పోతున్నాయి. గత ప్రభుత్వంలో ఇసుక, మెటల్ వంటి భవన నిర్మాణాలకు ఉపయోగించే వస్తువుల ధరల అస్తవ్యస్తమయ్యాయి. ఇసుక ర్యాంపుల్లో అయిన వారికే కిరాయిలు ఇవ్వటం తదితర కారణాల నేపథ్యంలో జగన్ ఐదేళ్ల పాలనలో సుమారు 500 టిప్పర్ లారీలను మెయింటెనెన్స్ చేయలేక ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లి అయినకాడికి అమ్ముకున్నారు. కూటమి పాలనలో మంచి రోజులు వస్తాయని ఆశించినా కిరాయిలు నానాటికి తీసికట్టుగా మారాయని లారీ యజమానులు వాపోతున్నారు.

పాలకొల్లు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఒక లారీ మెయింటెనెన్స్‌కి నెలకు డ్రైవర్, క్లీనర్ జీతాలు, లారీపై తెచ్చిన అప్పు ఫైనాన్స్ వాయిదా, ట్యాక్స్‌లు లారీ ఇతర మరమ్మతులు మొత్తంగా రూ. లక్ష ఖర్చు అవుతుందని లారీ యజమానులు చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమలో నాలుగు వేలు టిప్పర్ లారీలు ఉండగా ప్రధానంగా ఇసుక, మెటల్, మట్టి వంటి భవన నిర్మాణాలకు ఉపయోగించే మెటీరియల్‌ను తరలిస్తారు. ఒకవైపు వర్షాలు, మరోవైపు నిర్మాణాలు తగ్గుముఖం పట్టడంతో టిప్పర్ లారీలు స్టాండ్‌ల నుంచి కదిలే పరిస్థితి కనపడటం లేదు. రోజుకు రెండు నుంచి మూడు వందల లారీలు మించి కిరాయిలు దొరకని పరిస్థితుల్లో వచ్చే ఆరేళ్లలో సుమారు 1000 లారీలు అమ్మకానికి వెళ్లే అవకాశాలు ఉన్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. నమ్ముకున్న వృత్తిని వదలలేక.. వేరే పనులు చేయలేక లారీలనే పట్టుకుని ఉంటే పూట గడవటం కష్టంగా ఉంటోందని సకాలంలో వాయిదాలు చెల్లించకుంటే లారీలకు ఫైనాన్స్ ఇచ్చిన కంపెనీలు లారీలను సీజ్ చేస్తున్నాయని పలువురు లారీ యజమానులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం రన్నింగ్‌లో ఉన్న టిప్పర్ లారీలలో సుమారు 20 శాతం లారీలు ఓనర్ కమ్ డ్రైవర్లవే. మరో 20 శాతం లారీలు కాస్త ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉన్న యజమానులవి కాగా మిగిలిన 60 శాతం లారీలు కేవలం జీవనాధారం కోసం కిరాయిలుకు తిప్పుకునే యజమానులే..

ప్రభుత్వాలు ఆదుకోవాలి

గ్రీన్ ట్యాక్స్ (హరిత పన్ను) వంటి వాటిపై ప్రభుత్వం రాయితీ కల్పించడం సంతోషదాయకం అయినప్పటికీ లారీ స్పేర్ పార్ట్సు ధరలు, డీజిల్ ధరలు భరించే స్థితిలో లేమని లారీ యజమానులు చెబుతున్నారు. డీజిల్ ధరను రాష్ట్ర ప్రభుత్వం తగ్గించాలని కోరుతున్నారు. రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు మాదిరిగానే చిన్న తరహా లారీ యజమానులకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలని భవిష్యతులో రవాణా రంగం ఉనికి కోల్పోకుండా ఉండాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని లారీ యజమానులు కోరుతున్నారు.

గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నాం



లారీలకు కిరాయిలు లేక గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నాం. ఎలా బ్రతకాలో కూడా తెలియడం లేదు. నెలవారీ ఖర్చులకు కూడా ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం ఆదుకోకపోతే లారీలు అమ్ముకోవడం తప్ప గత్యంతరం లేదు.

- కె.సతీష్, లారీ ఓనర్, తాళ్లపూడి


డీజిల్ ధరలు తగ్గించాలి



రాష్ట్ర ప్రభుత్వం డీజిల్ ధరలను తగ్గించాలి. ఒక పక్క రోజూ కిరాయిలు లేక స్టాండ్‌ల్లోనే ఉంటున్నాయి. అడపాదడపా కిరాయి తగిలితే డీజిల్ ఖర్చు భారమవుతోంది. ప్రభుత్వం తమను ఆదుకోవాలి.

-రాము, లారీ ఓనర్, విజ్జేశ్వరం

పీ-4 పథకంలో చేర్చాలి



రవాణా రంగానికి మేలు జరుగుతుందనే ఉద్దేశ్యంతో తమ యూనియన్ తరపున కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటానికి సహకరించాం. పీ-4 పథకంలో పేద లారీ యజమానులను చేర్పితే ఆయా కుటుంబాలు రెండు పూటలా సంతోషంగా తిండి తినే అవకాశం ఉంటుంది.

-రావూరి రాజా, అధ్యక్షుడు, ఉమ్మడి పశ్చిమ టిప్పర్ లారీల అసోసియేషన్

ఎంతెంత దూరం..

ఇదేం భారం!

- విద్యార్థుల రవాణా భత్యం నిర్ధారణలో అడ్డగోలు అంకెలు
- వాస్తవ పరిస్థితులకనుగుణంగా విద్యార్థుల సంఖ్యను తేల్చాలని ఆదేశాలు

ఇంటి నుంచి నిర్ణీత దూరానికి పైబడి ప్రభుత్వ పాఠశాలలకు రాకపోకలు సాగించే బాలబాలికలకు చెల్లించేందుకు ఉద్దేశించిన రవాణా భత్యం (ట్రాన్స్‌పోర్టు అలవెన్సు)కు ఏలూరు జిల్లాలో లబ్ధిదారులను గుర్తించే పనిని పలువురు హెచ్‌ఎంలు, సీఆర్పీలు, ఐటీ సెల్ సిబ్బంది అపహాస్యం చేసిన విషయం వెలుగులోకి వచ్చింది.

ఏలూరు అర్బన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):ఈ ఏడాది పాఠశాలల పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో జిల్లాలో ఏ ఒక్క పాఠశాలను మూసి వేయకుండా నూతన స్ట్రక్చర్ ప్రకారమే కొత్త పాఠశాలల ఏర్పాటు, కొన్నిచోట్ల విలీనం జరిగినా... జిల్లాలో ఆయా పాఠశాలలకు దాదాపు 4 వేల మందికి పైగా విద్యార్థులు దూర ప్రాంతాలనుంచి వస్తున్నట్టు అందజేసిన నివేదికలపై రాష్ట్ర ఉన్నతాధికారులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రవాణా భత్యం చెల్లింపు నకు ప్రభుత్వం పంపిన మార్గదర్శకాలను సరిగా అర్థం చేసుకోకుండానే క్షేత్రస్థాయిలో మూకుమ్మడిగా విద్యార్థులను ఎంపిక చేశారని అసంతృప్తి వ్యక్తం చేసారు. ఇటువంటి అడ్డగోలు వివరాలనే ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారులను ఖరారుచేస్తే ట్రాన్స్‌పోర్టు అలవెన్సు చెల్లించడానికి సమగ్ర శిక్ష వార్షిక బడ్జెట్ నిధుల్లో సగం ఖర్చుచేసినా సరిపోవని జిల్లాలో జరిగిన సర్వే వివరాల సేకరణను నేరుగానే తప్పుబట్టారు.

అమాంతం పెరిగిపోయిన అంకెలు

దూరాభారం కారణంతో పాఠశాలకు రాకుండా ఇంటి వద్దే ఉండిపోతున్న బాలబాలికలు చదువు కొనసాగించాలన్న లక్ష్యంతో సమగ్ర శిక్ష ద్వారా సంబంధిత విద్యార్థులకు రవాణా భత్యాన్ని చెల్లిస్తున్నారు. ఆ ప్రకారం ఇంటి నుంచి ప్రభుత్వ పాఠశాలకు ఒక కిలోమీటరు దూరం పైబడి రాకపోకలు సాగించే ప్రాథమిక తరగతుల విద్యార్థులు, 3 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే ప్రాథమికోన్నత తరగతుల విద్యార్థులు, 5 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే హైస్కూలు విద్యార్థులు ఒకొక్కరికి నెలకు రూ.600లు చొప్పున ట్రాన్స్‌పోర్టు అలవెన్సును చెల్లించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. విద్యా సంవత్సరంలో 10 నెలల కాలానికి చెల్లించే ఈ అలవెన్సుని ప్రతి 3 నెలలకోసారి విద్యార్థి తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాకు జమచేస్తారు. ఆ లెక్కన ఎంపికైన విద్యార్థికి ఏడాదికి రూ.6 వేలు చొప్పున రవాణా భత్యాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో గత విద్యా సంవత్సరం (2024-25)లో జిల్లాలో ప్రాథమిక తరగతుల విద్యార్థులు 216 మందిని, హైస్కూలు తరగతుల విద్యార్థులు 51 మందిని కలిపి మొత్తం 268 మందికి రవాణా భత్యాన్ని చెల్లించారు. ఈ అలవెన్సునే ఈ ఏడాది కూడా కొనసాగించడానికి సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు అన్ని జిల్లాల నుంచి అర్హులైన విద్యార్థులను ఎంపిక చేసి నివేదికలను పంపాలని గత నెలలో కోరారు. దీనికనుగుణంగానే మార్గదర్శకాల మేరకు హెచ్‌ఎంల లాగిన్‌లలో దూరాభారం విద్యార్థులను ఎంపిక చేయాల్సి ఉండగా, పలువురు ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు ఎడాపెడా నమోదు చేసినట్టు అధికారులు గుర్తించారు. ఆ ప్రకారం జిల్లాలో ఏకంగా 4 వేల మందికి పైగా బాలబాలికలు నిర్ణీత దూరానికి పైబడి పాఠశాలలకు రాకపోకలు సాగిస్తున్నట్టు చేసిన ధ్రువీకరణలు అశాస్త్రీయమని రుజువు చేసేందుకు పలు వాస్తవ విషయాలను జిల్లా అధికారులకు పంపారు.

అన్ని స్కూళ్లు యథాతథంగా కొనసాగుతున్నా...

జిల్లాలోని 27 మండలాల్లోని 1502 హేబిటేషన్ల(ఆవాస ప్రాంతాలు)లో మొత్తం 1609 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఈ ఏడాది జరిగిన పాఠశాలల పునర్వ్యవస్థీకరణ మేరకు కొత్తగా ఏర్పడిన 9 రకాల స్కూళ్ల విధానంలో ఇంతకుముందున్న 1609 పాఠశాలల్లో ఏ ఒక్క స్కూలును మూసివేయలేదు. ఆ మేరకు ఆయా హేబిటేషన్లలో ఏదో ఒక ప్రభుత్వ పాఠశాల కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థి తనకు అందుబాటులో ఉన్న పాఠశాలలో చేరకుండా వారి అభీష్టం ప్రకారం నచ్చిన స్కూలులో చేరిన సందర్భాలను, వాస్తవ పరిస్థితులను సరిగా పరిశీలించకుండా లేదా పరిగణనలోకి తీసుకోకుండా రవాణా భత్యానికి ఎలా అర్హత కల్పిస్తారని జిల్లా అధికారులను ప్రశ్నించినట్టు తెలిసింది. విద్యార్థి నివాసానికి నిర్ణీత పరిధిలో అసలు ప్రభుత్వ పాఠశాలనేది లేనట్టయితే రవాణా భత్యానికి అర్హులేనని, దీనికి భిన్నంగా జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక జరిగినట్టుగా స్పష్టమవుతోందని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఇపుడున్న పరిస్థితుల్లో జిల్లాలో కొయ్యలగూడెం, పోలవరం మండలాల్లో కొన్నిచోట్ల మినహా మిగతా ప్రాంతాలన్నింటిలో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల రాకపోకలకు నిర్ణీత దూరానికి లోబడే ఉన్నాయని చెబుతున్నారు. ఈ క్రమంలో తమ వద్ద ఉన్న డేటాను క్రోడీకరించి లబ్ధిదారుల నిర్ధారణకు జాబితాలను మండలాలకు పంపిస్తామని, వాటిని క్షేత్రస్థాయిలో వాస్తవ వివరాలతో సరిపోల్చుకుని సమగ్ర సమాచారంతో తుది నివేదికలను గురువారంలోగా పంపాలని ఆదేశించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కలిదిండి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన సోమవారం భాస్కరరావుపేటలో జరిగింది. గ్రామానికి చెందిన గుండాల శ్రీలక్ష్మి(45) సోమవారం ఇంటి ఆవరణలో మోటార్ వేసి కుళాయి నీరు పట్టుకుంటుండగా, మోటారు వైరు చేతికి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ కె.నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో లారీ డ్రైవర్ హల్‌చల్

కొయ్యలగూడెం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):మద్యం మత్తులో ఒక లారీ డ్రైవర్ హల్‌చల్ చేశాడు. దీంతో ఆ లారీని కొంతమంది యువకులు ఆపి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ నుంచి కూరగాయల లోడుతో వస్తున్న ఈ లారీ డ్రైవర్ రెండు మోటర్ సైకిల్‌తో పాటు ఒక కోత మిషన్ వద్ద రోడ్డుపక్కన ఉన్న టైర్లను ఢీకొట్టాడు. అక్కడ ఉన్న యువకులు ఆ లారీని గుర్తించి ఆపడంతో డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్టు గుర్తించి పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేశారు.

డ్రంకెన్ డ్రైవ్.. ఎనిమిది మందికి జరిమానా

కాళ్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనం నడిపిన వారికి రూ.80 వేలు జరిమానా విధించినట్టు కాళ్ల ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు.గతంలో మద్యం మత్తులో వాహనాలు నడిపిన 8మందిపై కేసు నమోదు చేసి భీమవరం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు. స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎంవీఎస్ రాజారావు వీరికి రూ.10వేల చొప్పున రూ.80 వేలు జరిమానా విధించారని తెలిపారు.

ఈ మోపెడ్ ఎవరిదో?



ఆకివీడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఒక మోపెడ్ (ఏపీ 37 ఎక్యూ 2086) సుమారు 15 రోజులుగా ఆకివీడు ఎస్.టర్నింగ్ కూడలిలో ఉంటోంది. కూడలిలో ఉంటున్న ఈ మోటార్ సైకిల్ ఎవరిదో అంటూ పలువురు చర్చించుకుంటున్నారు. ఇక్కడ ఈ మోటారు సైకిల్‌ను ఎందుకు పెట్టారో తెలియరావడం లేదు. ఈ మోటారు సైకిల్‌ను జాతీయ రహదారి పక్కనే పెట్టినా ఎవ్వరూ ముట్టుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఇరువర్గాల ఘర్షణ.. కేసు నమోదు

ఆకివీడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):దుంపగడపలో ఇరువర్గాలు ఘర్షణపడి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఏఎస్ఐ బండి సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దుంపగడప వినాయక గుడి దగ్గర చీకటి మోహన్ పవన్, బొల్లా సాయి, సేనాపతి రాజేష్, బొల్లా గణేష్, బొల్లా వెంటేశ్వరరావులు గణపతి విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఆదివారం పనులు చేపట్టారు. అయితే కొట్టు సాయి, కొట్టు ధనబాబు, కొట్టు నాగరాజు, కొట్టు గంగరాజులు వద్దనడంతో మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీంతో ఇరు వర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

కొల్లేరులో పడి యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):పశువులు మేపడానికి వెళ్లిన ఒక యువకుడు ప్రమాదవశాత్తు కొల్లేరులోని చేపల చెరువులో పడి మృతి చెందాడు. ఏలూరు రూరల్ ఎస్ఐ నాగబాబు తన సిబ్బందితో సోమవారం ఉదయం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడు గ్రామానికి చెందిన మోరు రామారావు(34) చేపల వేటకు వెళ్తూ ఉంటాడు. గేదెలను కూడా కాస్తూ ఉంటాడు. ఈనెల 17న ఉదయం యథావిధిగా గేదెలను తోలుకుని కొల్లేరుకు వెళ్లాడు. కొల్లేరు నుంచి సాయంత్రానికి గేదెలు ఇంటికి వచ్చేశాయి. రామారావు మాత్రం తిరిగి రాకపోవడంతో గాలించగా సోమవారం ఉదయం కొల్లేరులోని సొసైటీ చెరువులో అతడి మృతదేహం లభించింది. తండ్రి మోరు చిరంజీవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆపరేషన్ ట్రేస్..

- అదృశ్యమైన వారి ఆచూకీ కోసం పోలీసుల ప్రత్యేక డ్రైవ్
- ఇప్పటి వరకు 13 మంది గుర్తింపు
- మిగిలిన కేసుల కోసం దర్యాప్తు వేగవంతం
- తెలియాల్సి ఉన్న 178 మంది ఆచూకీ



వరంగల్‌లో ఉన్నట్టు గుర్తించిన కుటుంబం(ఫైల్)

ఏలూరు క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : తమ కుటుంబ సభ్యుల్లో ఎవరైనా తప్పిపోతే పడే వేదన అంతాఇంతా కాదు. అప్పటి వరకూ ఆ కుటుంబం సుఖసంతోషాలతో ఆనందంగా జీవిస్తూ ఒకరిపై ఒకరికి ఒక్కక్షణం కోపం ఉన్నా మరుక్షణంలో ప్రేమగా మమకారాన్ని పెంచుకుని జీవిస్తుంటారు. అలాంటి కుటుంబాల్లోని వారు ఓ ఒక్కరు మిస్సైనా ఆ బాధ వర్ణనాతీతం. ఇలాంటి వారి బాధను తీర్చాలని దూరమైన బిడ్డలను తల్లిదండ్రుల చెంతకు చేర్చాలని, అదృశ్యమైన వారి జాడకనుగొని ఆ కుటుంబాలకు అప్పగించి, ఆ కుటుంబాల్లో ఆనందాలు నింపాలని పోలీసు శాఖ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులతో రాష్ట్రం మొత్తం ఆగస్టు 1వ తేదీ నుంచి ఆపరేషన్ ట్రేస్ కార్యక్రమాన్ని చేపట్టింది.

పోలీస్ స్టేషన్లలో ప్రత్యేక బృందాలు..

ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆదేశాలతో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలోనూ, సబ్ డివిజన్ల పరిధిలో స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. తొలుత పోలీస్ స్టేషన్లలో నమోదైన మిస్సింగ్ కేసుల ఎఫ్ఐఆర్‌ల దుమ్ముదులిపారు. ఆ కుటుంబాల వద్దకు వెళ్ళి అదృశ్యమైన వారి వివరాలు, ఆ కుటుంబ పరిస్థితులు, ఏ కారణం చేత వెళ్లిపోవాల్సి వచ్చిందో తెలుసుకున్నారు. మరోవైపు అనాథలుగా ప్రభుత్వ వసతి గృహాల్లో, స్వచ్ఛంద సేవా సంస్థలు, ఎన్‌జీవోల గృహాల్లో ఉన్న బాలబాలికల వివరాలు తెలుసుకుని తల్లిదండ్రుల చెంతకు చేర్చేప్రయత్నం చేపట్టారు.

ఇప్పటి వరకు 13 మంది గుర్తింపు..

ఇప్పటికి వరకు 13 మందిని గుర్తించి వారిని తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గత మూడేళ్లల్లో జిల్లాలో అదృశ్యమైన వారిని పరిశీలిస్తే 2023 మంది 299 మంది మహిళలు అదృశ్యం కాగా ఇంకా పది మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. 198 మంది పురుషులు అదృశ్యం కాగా 41 మంది ఆచూకీ కానరాలేదు. 98 మంది బాలికలు అదృశ్యం కాగా ముగ్గురి జాడ తెలియలేదు. 57 మంది బాలురు అదృశ్యం కాగా ఒకరి ఆచూకీ తెలియలేదు. 2024లో 284 మంది మహిళలకు 12 మంది జాడ కానరాలేదు. 164 మంది పురుషులు అదృశ్యం కాగా 39 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. 103 మంది బాలికలు అదృశ్యం కాగా, ఒక బాలిక ఆచూకీ తెలియాల్సి ఉంది. 41 మంది బాలురు అదృశ్యం కాగా ఇద్దరి ఆచూకీ తెలియాల్సి ఉంది. 2025లో ఇప్పటి వరకూ 179మంది మహిళలు అదృశ్యం కాగా 26 మంది జాడ తెలియాల్సి ఉంది. 128 మంది పురుషులు అదృశ్యం కాగా 41 మంది వివరాలు లభ్యం కాలేదు. 98 మంది బాలికలు అదృశ్యం కాగా ఇంకా ఎనిమిది మందిని గుర్తించాల్సి ఉంది. 42 మంది బాలురు అదృశ్యం కాగా ఇద్దరి ఆచూకీ తెలియాల్సి ఉంది. మొత్తం మీద మూడేళ్ళల్లో అత్యధికంగా పురుషులు 113 మంది అదృశ్యాన్ని గుర్తించాల్సి ఉంది, 48 మంది మహిళలు, 12 మంది బాలికలు, ఐదుగురు బాలుర ఆచూకీ తెలియాల్సి ఉంది. చిన్న బాలికలు, బాలురు అదృశ్యం అయ్యారంటే ఆ కుటుంబాలతో పాటు పోలీసులు కూడా ఆందోళనకు గురవుతున్నారు. ఆగమేఘాల మీద శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి సాధ్యమైనంత మేరకు ఆచూకీ కనుగొని తల్లి దండ్రులకు అప్పగిస్తున్న సంఘటనలు జిల్లాలో ఎన్నో జరిగాయి.

భర్త చెంతకు భార్య, పిల్లలు..

2019లో ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన అదృశ్యం కేసును దర్యాప్తు చేసి తల్లిని ఇద్దరు పిల్లలను వరంగల్‌లో గుర్తించి తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తడికలపూడి పోలీస్ పరిధిలో కూడా ఇదే విధంగా 2019లో నమోదైన మరో కేసులో కూడా తల్లి ఆమె ఇద్దరు పిల్లలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏలూరు శనివారపుపేట ప్రభుత్వ వసతి గృహంలో ఉన్న నలుగురు బాలురిని, భీమవరం వన్ స్టాప్ సెంటర్‌లో ఉన్న ఇద్దరు బాలికల నుంచి వివరాలు తెలుసుకుని వారి తల్లిదండ్రులకు జిల్లా పోలీసులు అప్పగించారు. నూజివీడు రూరల్‌లో ఒక బాలిక అదృశ్యం కావడంతో గుర్తించి తల్లి దండ్రుల చెంతకు చేర్చారు. శక్తి టీమ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయి. ఎవరైనా బాలబాలికలను ఇళ్ళల్లో అనుమానాస్పదంగా ఉంచితే తమకు సమాచారం ఇవ్వాలని బాల కార్మికులుగా పనులు చేయించుకున్నా తెలియజేయాలని సూచిస్తున్నారు.

ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం : ఎస్పీ



అదృశ్యమైన వారి ఆచూకీ కనుగొనడానికి ఆపరేషన్ ట్రేస్‌ను జిల్లాలో ప్రత్యేక బృందాలతో నిర్వహిస్తున్నాం. జిల్లాలో ఇప్పటి వరకూ అదృశ్యం కేసుల స్థితిగతులను పరిశీలిస్తున్నాం. ఆపరేషన్ ట్రేస్ ద్వారా ఇప్పటికి 13 మంది ఆచూకీ కనుగొని వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చాం. మిగిలిన వారి ఆచూకీ కనుగొనడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వినియోగిస్తు న్నాం. తప్పిపోయిన పిల్లల సమాచారాన్ని 112కు ఫోన్ చేయడం ద్వారా కాని చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098కుగాని శక్తి టీమ్ సెల్‌నెంబర్ 79934 85111 సమాచారం అందించాలి. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

భర్తతో మనస్పర్థలు.. పిల్లలతో సహా తల్లి అదృశ్యం



అదృశ్యమైన పిల్లలు, తల్లి శిరీష

ముదినేపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం శ్రీహరిపురం గ్రామంలో తల్లీ పిల్లలు అదృశ్యమయ్యారు. భర్తతో ఉన్న మనస్పర్థల నేపథ్యంలో ఆ మహిళ తనతోపాటు పిల్లల్ని కూడా తీసుకుని వెళ్లిపోయింది. శ్రీహరిపురం గ్రామానికి చెందిన ననకా రవీంద్రకు కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామానికి చెందిన లక్ష్మీ శిరీషతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి 12 ఏళ్ల కుమారుడు, ఏడేళ్ల కుమార్తె ఉన్నారు. తాపీ పని చేసుకుంటూ జీవిస్తున్న రవీంద్రకు భార్య శిరీషకు ఇటీవలి కాలంలో మనస్పర్థలు ఏర్పడగా తరచూ ఆమె పిల్లల్ని తీసుకుని కోరుకొల్లులోని పుట్టింటికి వెళ్లిపోయేది. భర్త రవీంద్ర వెళ్ళి తిరిగి తమ ఇంటికి తీసుకువచ్చేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 15న మధ్యాహ్నం శిరీష తన పిల్లలను తీసుకుని ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. అత్తమామలకు ఫోన్ చేసి అడగ్గా తమ ఇంటికి రాలేదన్నారు. అప్పటి నుంచి పలుచోట్ల వెతికినా వారి ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం రవీంద్ర తన భార్యా పిల్లల అదృశ్యంపై ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వారి ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు.

వివాహిత ఆత్మహత్య

కలిదిండి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గుళికలు తిని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. కలిదిండికి చెందిన ఏలూరి వాణి(22) భర్త పవన్‌కి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. భర్త మద్యానికి బానిసై కుటుంబ పోషణ పట్టించుకోకుండా ఆమెను శారీరకంగా, మానసికంగా హింసిస్తుండటంతో మనస్థాపానికి గురై సోమవారం విషపు గుళికలు మింగింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆమెను కలిదిండి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేసి హుటాహుటిన భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివాలయంలో చిరంజీవి పేరిట పూజలు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మెగస్టార్ చిరంజీవి పుట్టిన రోజు ఆగస్టు 22ను పురస్కరించుకుని సోమవారం స్థానిక పంచాయతీ రాజ్ కార్యాలయం వద్ద ఉన్న శివాలయంలో చిరంజీవి యువత ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఇందిరానగర్ కాలనీలో ఉన్న శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. సంఘ గౌరవాధ్యక్షుడు చింతల నాని, బ్లడ్‌బ్యాంక్ అధ్యక్షుడు వలవల తాతాజీ, పట్టణ అధ్యక్షుడు ఉక్కుర్తి సీతారాం, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పీసుపాటి రామలక్ష్మి పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహా సభలపై పోస్టర్ విడుదల

కుక్కునూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 23వ తేదీ నుంచి 24వరకు జరగనున్న రాష్ట్ర మహాసభలకు సంబంధించి సీపీఐ మండల నాయకులు సోమవారం పోస్టర్ విడుదల చేశారు. జీరువర్గంలో కూడా ప్రతీ కార్యకర్త మహాసభలకు రావాలని ప్రచారం నిర్వహించారు. మహాసభల్లో నిర్వహించే యర్రకవాతులో పాల్గొనడానికి మండలంలోని కార్యకర్తలకు శిక్షణనిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య, వరకా శ్యామలా, ఐతా సురేశ్, ఎం.వెంకటాచారి, కే.బాబురావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఇన్సెంటివ్ సొమ్ములు చెల్లించాలి

ఏలూరు క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎన్టీఆర్ వైద్య సేవ(ఆరోగ్య శ్రీ) ఇన్సెంటివ్ సొమ్ములు చెల్లించాలని ది మెడికల్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు, ప్రధాన కార్యదర్శి వి.దత్తాత్రేయు(దత్తు)లు కోరారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని మెయిల్ ద్వారా పంపించారు. జీవో ఆర్టీ నెంబర్ 123, 833 ప్రకారం రోగులకు సేవలందిస్తున్న డాక్టర్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకూ ఎన్టీఆర్ వైద్య సేవ ఇన్సెంటివ్ సొమ్ములు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి వైద్య విధాన పరిషత్‌లో ఉన్నంత కాలం పారిశుధ్య కార్మికులకు, క్రిందిస్థాయి సిబ్బందికి కూడా ఆరోగ్య శ్రీ సొమ్ములను ఇచ్చారన్నారు. గత నాలుగేళ్లుగా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఈ సొమ్ము ఎవరి ఖాతాలో జమ చేశారో అధికారులు తేల్చాలన్నారు. ఇప్పటికైనా ఎన్టీఆర్ వైద్యసేవ ఇన్సెంటివ్ సొమ్ములలో పారిశుధ్య కార్మికులకు ఐదు శాతం వాటా చొప్పున జమ చేయాలని కోరారు.

జడ్పీ పీఎఫ్ తుది చెల్లింపులకు వినతి

ఏలూరు అర్బన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జడ్పీ పరిధిలోని కార్యాలయాలు, పాఠశాలల్లో పని చేసి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు జడ్పీ ప్రావిడెంట్ ఫండ్ తుదిచెల్లింపుల్లో జాప్యాన్ని నివారించాలని ఏపీటీఎఫ్-1938 కోరింది. ఈ మేరకు జరుగుతున్న జాప్యాన్ని నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తూ సోమవారం ఏపీటీఎఫ్-1938 జిల్లా నాయకులు జడ్పీ డిప్యూటీ సీఈవో భీమేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామ్మోహన్, మోహన్ మాట్లాడుతూ పీఎఫ్ ఖాతాలను గత నాలుగు నెలలుగా ఆడిట్ చేయనందున తుది చెల్లింపులు నిలిచిపోయాయన్నారు. ఆడిట్ సిబ్బంది కలెక్టరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తుండటంతో సమస్య తలెత్తిందని డిప్యూటీ సీఈవో తమకు చెప్పారని వివరించారు. ఆడిట్ చేయకుండా పెండింగ్‌లో ఉంచిన ఫైనల్ పేమెంట్ ఖాతాలను వెంటనే ఆడిట్ చేయించి తుది చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. నాయకులు శ్రీనివాసరావు, నాగరాజు, రమేశ్ పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం

కామవరపుకోట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సొసైటీలను బలోపేతం చేసి సభ్యులకు, రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఉందని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌లు తెలిపారు.సోమవారం కామవరపుకోట మండలం గుంటుపల్లి పంచాయతీలోని జీలకర్రగూడెం శ్రీధర్మలింగేశ్వర విశాల సహకార సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా వేగుంట సురేష్‌ను, కమిటీ సభ్యులుగా తలతోటి బాబూరావు, నరదల పుల్లయ్యలతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆప్కాబ్ ఛైర్మన్ మాట్లాడుతూ సొసైటీలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై, రైతులపైన ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, కూటమి నాయకులు బేతిన వెంకట్రావు, గోరింక దాసు, కంఠమనేని ఆంజిమూర్తి, కంఠమనేని సత్యనారాయణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్‌లు జగ్గవరపు ముత్తారెడ్డి, కోనేరు వెంకట సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్, టీడీపీ మండల అధ్యక్షులు ఏలూరి శివరామకృష్ణ పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న సాయివినయ్

మల్లుకుంట సొసైటీ ఛైర్‌పర్సన్‌గా శీలం సాయివినయ్

టి.నర్సాపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఛైర్ పర్సన్‌గా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు తనయుడు శీలం సాయివినయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సొసైటీల త్రిసభ్య కమిటీల్లో మల్లుకుంట సొసైటీకి ఛైర్‌పర్సన్‌గా శీలం సాయివినయ్ పర్సన్‌లుగా వెదుళ్ల వెంకటేశ్వరరావు, తలారి ఆంధ్రబాబు, కూటమి ప్రభుత్వం ఎంపిక చేయడంతో వారు స్థానిక కూటమి నాయకులతో కలిసి ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సాయి వినయ్ మాట్లాడుతూ సహకార సంఘ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ సంఘ వ్యాపార విస్తరణకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు, టీడీపీ తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ, మాజీ సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసరావు, శ్రీను, గన్నబోయిన వెంకట్రావు, కాల్నిడి రాంబాబు, సంఘ సీఈవో సత్యనారాయణ, బోనాల కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా.. సాగండి!

(5వ పేజీ తరువాయి)

ప్రాధాన్యత ఇస్తున్నార న్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలో లక్షా 60వేల968 మంది రైతులకు రూ.107.08 కోట్లు అందించామన్నారు. జిల్లాలో వృద్ధిరేటు పెంచేందుకు వీలుగా ఉద్యానవన పంటల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో యూరియా, డీఏపీ కొరత లేదన్నారు. ఆయిల్‌పామ్ గెలలు కోసే సమయంలో విద్యుత్ షాక్‌కు కూలీలు గురవుతున్నారని, దీనికి శాశ్వత పరిష్కారం కనుగొనాలని మంత్రి సూచించారు.2014-19 మధ్యన గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల్లో పెం డింగ్ బిల్లుల చెల్లింపుల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వా సితులకు అంత్యోదయ అన్నయోజన కార్డులను అందించామని, గిరిజన ప్రాంతాల్లో నివసించే వారికి వీటిని అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. వచ్చే సమావేశం నాటికి కనీసం నాలుగు ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

నూజివీడులో ఆటో నగర్‌కు సహకారం : మంత్రి కొలుసు

నూజివీడులో ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన భూసేకరణకు తాను పూర్తిగా సహాయ, సహకారాలను అందిస్తానని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. పీఎంఏవై-ఎన్టీఆర్ గృహనిర్మాణ కాలనీల్లో రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయా లకు ఉపాధి హామీ కింద చేపట్టాలని మంత్రి సూచించారు. మామిడికి ఎటువంటి చీడ, పీడలు సోకకుండా పూత దశలోనే గుర్తించి రైతులకు తగిన మందులను అందించాలని, కల్తీ విత్తనాలను అరికట్టాలన్నారు. ఆర్వోఎఫ్ఆర్ పథకం కింద రైతులకు అందించిన భూముల్లో సాగుకు అవసరమైన బోర్లకు అనుమతించాలన్నారు. ఇరిగేషన్ ఛానల్స్‌లో పూడికతీత పనులను కనీసం రెండుఅడుగుల లోతుకు తీయాలన్నారు. గత ఏడాది అక్రమమైనింగ్ చేసిన వారిపై అపరాధ రుసుంగా రూ.3 కోట్లు విధించి వసూలు చేయాలన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు షట్టర్ మరమ్మతులకు తెలంగాణ ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కాగా భారీ వర్షాలు, వరదల కారణంగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.

గోదావరికి వరద పోటు

(5వ పేజీ తరువాయి)


ఉధృతంగా ప్రవహిస్తున్న శబరి

స్తంభించాయి. గోదావరి నది ఎగువ భాగాన తెలంగాణలోని గోదావరి పరీవా హక జిల్లాలైన భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, ములుగు, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు రెడ్ ఎలర్ట్ ప్రకటించటంతో అక్కడ భారీ వర్షపాతం నమోదవుతోంది. నీరంతా గోదావరికే వచ్చి చేరనుండటంతో భద్రాచలం వద్ద వరద తీవ్రత అధికమయ్యే ప్రమాదం పొంచి ఉంది. భద్రాచలం నుంచి దిగువకు ఏడు లక్షల 19 వేల క్యూసెక్కుల వరద నీరు కిందకు వస్తోంది. బ్యాక్ వాటర్ రూపంలోను ముంపు ఏర్పడనుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొం ది. గోదావరి వరద ప్రభావంతో కుక్కునూరు మండలంలోని గుండేటివాగులో లెవెల్ కాజ్‌వే నీట మునిగింది. గోదావరి మరో నాలుగు అడుగులు పెరిగితే ముంపు తప్పదని పత్తి, అరటి సాగు చేసే రైతాంగం ఆందోళన చెందుతున్నారు. పంటలు మునిగే అవకాశం ఉందని రైతాంగం చెబుతున్నారు. కాగా ప్రజలెవరు గోదావరి తీర ప్రాంతాలకు వెళ్లవద్దని తహసీల్దార్ రమేశ్‌బాబు హెచ్చరించారు. జాలర్లు వేటను నిలిపివేయాలని సూచనలు జారీ చేశారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి అదనంగా వస్తున్న 6,42,370 క్యూసెక్కుల జలాలను జలవనరుల శాఖ అధికారులు దిగువకు విడుదల చేశారు. పట్టిసీమ శివక్షేత్రం వద్ద ఇసుకతిన్నెలు నీటమునిగాయి. శివక్షేత్రం చుట్టూ వరద జలాలు ఆక్రమించాయి.


గరుడాళ్వార్ కూడలిలో, ద్వారకాతిరుమల శివారులో


కుంకుళ్లమ్మ ఆలయ సమీపంలో రోడ్డు


విర్డ్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రోడ్డు దుస్థితి

గోతుల మయం..

పంగిడిగూడెం నుంచి ద్వారకాతిరుమల వరకు రోడ్డు అధ్వానం - వాహనదారులకు నరకప్రాయం

మరమ్మతులు చేపట్టాలంటూ ప్రజల వేడుకోలు - నాణ్యతగా నిర్మించాలని డిమాండ్

ద్వారకాతిరుమల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలకు ఆ రహదారిపై వెళ్లాలంటే యాత్రికులు, ప్రయాణికులు హడలిపోతున్నారు. రోడ్లన్నీ గుంతలతో పాటు చీలిపోయి పైకిలేచి మరింగా ఛిద్రమైనా పట్టించుకునే నాథుడే లేడు.ఆధ్యాత్మిక క్షేత్రం కావడంతో నిత్యం ఈ రహదారి వెంబడి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం ప్రయాణిస్తుంటారు. అయినా వారికి ఈ గోతులు, ఛిద్రమైన రహదారి కనిపించకపోవడం గమనార్హం. శ్రీవారి క్షేత్రానికి అధిక సంఖ్యలో వచ్చే భక్తుల సౌకర్యార్థం గత పుష్కరాల సమయంలో సుమారు రూ.50 కోట్లతో భీమడోలు నుంచి ద్వారకాతిరుమలకు రహదారిని నిర్మించారు. గోదావరి పుష్కరాలకు ముందు సింగిల్ రోడ్డును 4 లైన్లతో తారురోడ్డుగా మార్పు చేశారు. భీమడోలు నుంచి ద్వారకాతిరుమల వరకూ నాలుగురోడ్లుగానిర్మించేందుకు గాను ఆరుగురు కాంట్రాక్టర్లు పనులు చేశారు. రోడ్డు ప్రారంభించారు.. కష్టాలు తప్పాయని భక్తులు, ప్రయాణికులు సంతోషించినంత సేపు పట్టలేదు సంతోషం.. నాణ్యతా ప్రమాణాలు లోపించడంతో అది నిర్మించిన కొన్నాళ్లకే ఛిద్రమైంది. కేవలం రెండేళ్ల లోపే గుంతల మయంగా మారింది. కొన్నాళ్లు యాత్రికులు ఈ రహదారి గుండా క్షేత్రానికి వచ్చేందుకు అష్టకష్టాలు పడ్డారు. దీంతో దాదాపు మూడేళ్ల క్రితం ఈ రహదారిని రెండు లేయర్లతో పునర్నిర్మించేందుకు మరో రూ.16 కోట్లు మంజూరు కావడంతో పనులు పూర్తి చేశారు. మరోసారి ప్రయాణికుల ఆనందం చెప్పనలవి కాలేదు. పనులు పూర్తయి మరలా రాకపోకలు ప్రారంభమయ్యాయి. అయితే వారి ఆనందం కొద్ది రోజులకే ఆవిరైంది. ఈసారి మరింతగా రహదారి ఛిద్రమైంది. పంగిడిగూడెం నుంచి ద్వారకా తిరుమల వరకు పలుప్రాంతాల్లో రోడ్డు అధ్వానంగా మారడంతో ఈ రహదారిపై ప్రయాణం కత్తిమీద సాములా మారింది. ఎన్నో చోట్ల రోడ్డు పైకి లేచి మరీ పగిలిపోయింది. అయినా అటు పాలకులు ఇటు అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు సత్వరం స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


విర్డ్ ఆసుపత్రి వద్ద దుస్థితి


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

విద్యుత్ వైర్లను తొలగించండి

బుట్టాయగూడెం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో దళితుల ఇళ్లపైనుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ వైర్లను తొలగించాలని కోరుతూ సోమవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో దళితులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ పి.వి.చలపతిరావుకు వినతిపత్రం అందజేశారు. కేవీపీఎస్ జిల్లా నాయకుడు అందుగుల ప్రాన్సిస్ మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం దళితులకు కాలనీ నిర్మించి ఇచ్చారని కాలనీ మధ్యలో 11 కేవీ విద్యుత్ లైన్ వెళ్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్టు తెలిపారు. ఈ సమస్యను విద్యుత్ శాఖ అధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ తెలిపారు. కె.రమేశ్, ఎం.అశోక్ పాల్గొన్నారు.

చిరు అభిమానుల పూజలు

ఏలూరు రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మెగస్టార్ చిరంజీవి పుట్టిన రోజును పురస్కరించుకుని ఏలూరులోని పవర్‌పేట శివాలయంలో అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నగర పాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రసాద వితరణ చేపట్టారు. అభిమాన సంఘం నాయకులు గౌరవాధ్యక్షులు మారం హనుమంతరావు, అధ్యక్షులు శానం శ్రీరామకృష్ణ, కరణం లోకేష్(బన్ని),ఈదుపల్లి పవన్, పి.జగన్, లొట్టి రమేష్, పండు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

భీమడోలు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):పూళ్ళ శివారు ఎంఎంపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై సచివాలయ మహిళా కానిస్టేబుల్ సుజన అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు, మితిమీరిన వేగం, ట్రాఫిక్ నిబంధనలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల హెచ్ఎం ప్రసాద్, సర్పంచ్ దాయం సుజాత పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్య భద్రత

ఏలూరుటూటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పేదలకు ఆరోగ్యభద్రత కూటమి ప్రభుత్వం కల్పిస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఐదుగురు లబ్ధిదారులకు 8లక్షల 37వేలు విలువైన చెక్కులు అందించారు. వైద్యానికి డబ్బులు లేవని ఎవరూ బాధపడవద్దని అన్నారు. సమస్యల పరిష్కారానికి త్వరలోనే తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.


విగ్రహ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నాయకులు

ఎన్టీఆర్ విగ్రహం ప్రారంభం

ఏలూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండలం అన్నపునేనివారిగూడెంలో బొల్లినేని సత్యనారాయణ, శైలజల సహకారంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ప్రారంభించారు. అప్కాబ్, డీసీసీబీ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పీతల సుజాత, మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ రామకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విగ్రహావిష్కరణ అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, ముత్తారెడ్డి, గరిమళ్ల చలపతిరావు, మోరంపూడి మల్లికార్జునరావు, ఓ.సూరిబాబు, డి.రవీంద్ర, వెంకన్నబాబు, శోభారాజ్యం, పి.శ్రీను, ఎం.నాని, ఎం.కిరణ్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

బుట్టాయగూడెం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో ఉత్తమ సేవలందించినందుకు రెడ్డిగణపవరం జడ్పీ హైస్కూల్లో జూనియర్ సహాయకులుగా పని చేస్తున్న వెలుగు ప్రసాద్‌కు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉద్యోగ ప్రతిభ అవార్డును జడ్పీ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అందజేశారు. అవార్డు అందుకున్న ప్రసాద్‌ను సోమవారం పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం సరియం రామారావు, విద్యా కమిటీ ఛైర్మన్ ఎస్.బాబూరావు ప్రసాద్ సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టాలి : బీసీ సంఘం

ఏలూరుటూటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనగణనతో పాటు కులగణన కూడా చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే.శంకరరావు డిమాండ్ చేశారు. కొప్పుల వెలమ కల్యాణ మండపంలో బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ ఎన్నిక జరిగింది.ముఖ్య అతిథిగా పాల్గొన్న శంకరరావు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం 33శాతం అమలు చేయాలన్నారు. ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా ప్రకటించారన్నారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్నేపల్లి తిరుపతిరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్‌టీసీ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, చంద్రకిరణ్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.


స్కూల్ వద్ద గస్తీకాస్తున్న శక్తి టీం

ఏలూరు నగరంలో శక్తిటీమ్ గస్తీ

ఏలూరు క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మహిళలు ఎక్కడ ఉన్నా సురక్షితంగా ఉండేందుకు పోలీస్ శాఖ అద్భుతమైన చర్యలు చేపట్టిందని దీనిలో భాగంగానే శక్తియాప్‌ను తీసుకొచ్చిందన్నారు. ఈ యాప్ యాండ్రాయిడ్ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల తమతో పోలీసులు ఉన్నట్లేనని శక్తియాప్ బృందం సూచించింది.జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు పర్యవేక్షణలో శక్తిటీమ్ సభ్యులు ఏలూరులో ఉన్న కళాశాలలు, స్కూళ్ల వద్ద ముమ్మర గస్తీని సోమవారం సాయంత్రం నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. 112కు డయల్ చేస్తే పది నిముషాల్లోపు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుంటారన్నారు. మహిళలు రాత్రి వేళ అయినా ఒంటరిగా ప్రయాణించేటప్పుడు తమ ఫోన్‌లో శక్తియాప్ ఉంటే తమతో పరోక్షంగా పోలీసులు ఉన్నట్లేనని సూచించారు. ఈ యాప్‌లో మహిళల హక్కులు, చట్టాలు, పోలీస్ హెల్ప్‌లైన్ నెంబర్లు మొదలైనవి లభిస్తాయన్నారు. ఆకతాయిలు ఎవరైనా ఉంటే తమకు తెలియజేయాని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

మానవత ఆవిర్భావ దినోత్సవ ర్యాలీ

ఏలూరు రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మానవత ఆధ్వర్యంలో ఏలూరులో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆగస్టు 16 నుంచి 22 వరకు ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ, ఉత్తమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా శాంతి ర్యాలీని నిర్వహిం చడం ఆనవాయితీ.. ఈ ర్యాలీని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ప్రారంభించారు. ఆదిత్య డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమై సత్రంపాడు సెంటర్ వరకు సాగింది. డీఎస్పీ మాట్లాడుతూ మానవతా సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. జిల్లా మానవత కేంద్ర నియంత్రణ కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, ఏలూరు యూనిట్ అధ్యక్షుడు ఎంఎస్ఎంఎస్ కుమార్, మండల ఛైర్ పర్సన్ అడుసుమిల్లి నిర్మల, పోలవరపు దేవరత్నాకరరావు, కార్యదర్శి పూర సత్య నారాయణ, కోశాధికారి అల్లూరి మోహని, వాణి అశోక్ కుమార్ పాల్గొన్నారు.


సత్తిపండుకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

జనసేనలోకి మాజీ ఎంపీపీ?

కొయ్యలగూడెం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):మాజీ ఎంపీపీ వైసీపీ నేత మట్టా సత్తిపండు జనసేనలోకి చేరనున్నట్టు తెలిసింది. ఈ మేరకు సోమవారం కొయ్యలగూడెంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆయనకు కేకుతినిపించి పార్టీలోకి ఆహ్వానించినట్టు సమాచారం. త్వరలోనే ఆయన జనసేన తీర్థ తీసుకోనున్నట్లు మండలంలో ప్రచారం జరుగుతోంది. మట్టాసత్తిపండు గతంలో ఎంపీపీగా పని చేశారు. టీడీపీలోనూ కీలకపాత్ర పోషించారు. బీసీ నేతగా ఈయనకు మంచి పట్టు ఉంది.

పంట చేలు పరిశీలించిన బృందం

ఉంగుటూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని డెల్టా గ్రామాల్లో సోమవారం వ్యవసాయ అధికారుల బృందం పర్యటించింది. మండలంలోని రావులపర్రు, వి.ఏ.పురం, దొంతవరం, కాకర్లమూడి గ్రామాల్లో ఏరువాక శాస్త్రవేత్త డా.ఫణికుమార్ ఎస్.నాగేంద్రబాబు, పి.వి.రమణారావు, ఎ.ఆనంద్ పర్యటించారు. వీరితో పాటు మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ వై.పూర్ణ చంద్రప్రసాద్‌ల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ముంపునకు గురైన పంట పొలాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

● భీమడోలు: అల్పపీడనంతో కురుస్తున్న వర్షాలకు భీమడోలు మండలంలో 525 ఎకరాల్లో వరి ముంపునకు గురైనట్టు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. భీమడోలు, పూళ్ళ, గుండుగొలను తదితర గ్రామాల్లో వరిసాగు ముంపు గురైంది. పిలకలదశలో ఉన్న వరిమళ్ళ నుంచి నీటిని తీసివేయాలని 5 రోజుల కంటే ఎక్కువ ముంపునకు గురైన వరి నారును తీసివేసి మళ్లీ నాట్లు వేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

సర్దార్ పాపన్న గౌడ్ సమాజ సేవకుడు

కొయ్యలగూడెం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మండలంలోని గవరవరంలో ఆయన చిత్రపటం వద్ద కేకుకట్ చేసి మిఠాయిలు పంచారు. సమాజానికి ఆయన చేసిన సేవలను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కొనియాడారు. మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు, తదితర గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

● ఏలూరు: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని రాష్ట్ర అధికార ప్రతినిధి, అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శామ్‌చంద్రశేషు అన్నారు. లింగపాలెంలో మండల బీసీసెల్ అధ్యక్షుడు తాళం సోంబాబు ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అశోక్‌గౌడ్, జుజ్జూరి బాబ్జి, రామలింగేశ్వరరావు, చిలుకబత్తుల వీరభద్రరావు, పామర్తి వెంకటేశ్వరావు,గజ్జా వెంకటేశ్వరరావు, పరసా అయ్యప్ప, కాసగాని శివయ్య, బాదరాల కోటేశ్వరరావు, ప్రసాదు, చిన్నీలు, పామర్తి రాజు పాల్గొన్నారు.

● దెందులూరు: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ నిస్వార్థ సేవకుడని జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తొంట త్రిమూర్తి గౌడ్ అన్నారు. సోమవారం పెదవేగి మండలం కూచింపూడిలో పాపన్న గౌడ్ 375వ జయంతిని నిర్వహించారు. పెదవేగి బ్యాంక్ అధ్యక్షులు తాతా సత్యనారాయణ, మండూరి బ్యాంక్ అధ్యక్షుడు కొనకళ్ళ శివమణిగౌడ్. పామర్తి నాగ భూణం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గోపన్నపాలెంలో పాపన్నగౌడ్ విగ్రహానికి గౌడ సంఘం నాయకులు మారగాని సత్యనారాయణతో పాటు పలువురు పూలమాల వేసి నివాళులు అర్పించారు. చల్లచింతలపూడిలో వేమన రాముగౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు నివాళులర్పించారు.


విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

● టి.నర్సాపురం: టి.నర్సాపురంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని నిర్వహించారు. పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.గౌడ సంఘం అధ్యక్షులు వెంకటనాగేశ్వరరావు మాట్లాడుతూ 375 సంవత్సరాల క్రితమే బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. పదిమందితో గెరిల్లా సైన్యం ఏర్పాటు చేసి అనాతికాలంలోనే 12వేల మంది సైన్యంతో ఔరంగాజేబుపై తిరుగుబాటు చేసినటువంటి బహుజన చక్రవర్తి పాపన్న అన్నారు.పాపన్న జయంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అధికారికంగా ప్రకటించాలని కోరారు. గౌడ సంఘం నాయకులు పెద సత్యనారాయణ, శ్యామకూరి సత్యనారాయణ, పలగాని రాంబాబు, కాగితాల రాంబాబు, పైగాని చినవెంకటేశ్వ రరావు, పప్పు జయరాజు, నాగరాజు, చింతలపాటి మధు, పలగాని పోతురాజు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

టి.నర్సాపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):భారీ వర్షాల కారణంగా వాగులువంకలు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సాయిబాబా అన్నారు. టి.నర్సాపురం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్ఏలకు ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండలంలో ప్రవహించే కాల్వలు, వాగులు సమాచారాన్ని నిరంతరం తెలుసుకుంటూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అవసరమైతే పోలీసుల సాయంతో తగు చర్యలు చేపట్టాలన్నారు.

పదవుల్లో స్థానం కల్పించండి

ఉంగుటూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న పదవుల పందేరంలో తనకు అవకాశం కల్పించాలని కోరుతూ జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రెడ్డి సూర్యచంద్రరావు కోరారు. ఈ మేరకు సోమవారం అమరావతిలో తన వ్యక్తిగత బయోడేటాను అందించి వినతి పత్రం ఇచ్చారు.

టీడీపీ నాయకుల హర్షం

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు (పొందువ్వ శ్రీను)కు సహాయ మంత్రిగా హోదా కల్పించడం పట్ల రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసిన మంతెన సత్యనారాయణ రాజుకు సీఎం చంద్రబాబు మంచి గుర్తింపునిచ్చారన్నారు.


శేషగిరిరావును సన్మానిస్తున్న దృశ్యం

నిడమర్రు ఎంఈవో-2గా శేషగిరి

నిడమర్రు ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి):మండల విద్యాశాఖాధికారి-2గా యర్రంశెట్టి శేషగిరిరావు బాధ్యతలు స్వీకరించారు.సోమవారం నిడమర్రు మండల వనరుల కేంద్రంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈయన చానమిల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తుండగా ఎఫ్ఏసీగా నిడమర్రు మండల విద్యాశాఖాధికారి-2 అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈవో-1 అనూరాధ ఆయనకు అభినందనలు తెలియజేశారు. మాజీ ఎంఈవో కె.రాంబాబు, హెచ్ఎం సంకు ఏసుబాబు, కె.మల్లేశ్వరరావు, ఎ.రాంబాబు సన్మానించారు.

పొరుగువారిని ప్రేమించాలి

ఏలూరుటూటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పొరుగువారిని ప్రేమించటమే గొప్ప సేవ అని ఐసీఎం చర్చ్ బిషప్ మోస్ట్ రెవరెండ్ బిషప్ జాన్ఎస్‌డీ రాజు అన్నారు. ఐసీఎం చర్చ్ నిర్వహిస్తున్న మెర్సీహోమ్స్ విద్యార్థులకు దుప్పట్లు, టీషర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాన్ఎస్‌డీ రాజు మాట్లాడుతూ గడ్డం సత్యం అండ్ సన్స్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సేవా సంస్థ అనాద విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేయడం పట్ల అభినందించారు. ఫౌండేషన్ నిర్వాహకులు గడ్డం శామ్యూల్, సులోచన, కీర్తికర్, జీనీష, మెర్సీహోమ్ సూపరిండెంటెండ్ రోజ్ జాన్, వార్డెన్ ఫాదర్ యోగి పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి కృషి

పెదపాడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వట్లూరు సొసైటీ అభివృద్ధికి, సొసైటీలోని సంఘ సభ్యుల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని వట్లూరు సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన కొమ్మన లక్ష్మణమోహన్(బుడ్డి) తెలిపారు. సొసైటీ పాలకవర్గసభ్యులు, సిబ్బంది, ఖాతాదారుల సమక్షంలో సోమవారం త్రిసభ్య కమిటీ ఛైర్మన్ కొమ్మన లక్ష్మణమోహన్‌తో పాటుగా మెంబర్లు సీహెచ్ బాలమురళీకృష్ణ, నాగభూషణంలు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గారపాటి రామసీత, కొమ్మన వెంకటశ్రీధర్, గుత్తా అనిల్, మరడాని రవి, ముళ్ళపూడి సాంబశివరావు పాల్గొన్నారు.



మురుగు నుంచి విముక్తి కల్పించండి

ఉంగుటూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులపర్రు గ్రామంలో ఐదు నెలలుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు సోమవారం ఎంపీడీవోకు పిర్యాదు చేశారు. ఫిల్టర్ బెడ్‌లు పంచాయతీ నిధులతో బాగు చేశారని అయితే నాణ్యత లేని పనుల వల్ల మురుగు నీటిని వాడుతూ అనారోగ్యానికి గురవుతున్నట్టు వాపోయారు. గ్రామస్థులు యడవల్లి రామకృష్ణద్రోణిద్రి దానయ్య, ఇబ్బ పూజారి, ఇబ్బ నాగేశ్వరరావు, ముత్యాల రావు పిర్యాదు చేశారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

కామవరపుకోట, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జడ్పీ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులు సోమవారం రాత్రి తడికలపూడిలోని శ్రీగంగా పార్వతీ సమేత గాంగేశ్వరస్వామి ఆలయానికి నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సొసైటీ ఛైర్మన్ తూతా బాలాజీకుమార్‌తోపాటు కమిటీ సభ్యులు, స్థానికులు హాజరయ్యారు.


అభినందనలు తెలియజేస్తున్న దృశ్యం

చాట్రాయి ఎంపీడీవోగా భార్గవి బాధ్యతలు స్వీకారం

చాట్రాయి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): చాట్రాయి ఎంపీడీవోగా బి. భార్గవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆగిరిపల్లి ఎంపీడీవోగా పనిచేస్తున్న ఆమెను చాట్రాయి ఎంపీడీవో (ఎఫ్ఏసీ)గా నియమిస్తూ ఇటీవల జిల్లా అధికారులు ఆదేశాలిచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న విజయలక్ష్మి అనారోగ్య కారణాలతో సెలవు పెట్టడంతో ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా భార్గవి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయటంతో పాటు మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

కృష్ణారావుపాలెంలో 104 వైద్య శిబిరం

చాట్రాయి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): చనుబండ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం కృష్ణారావుపాలెంలో 104 వైద్య శిబిరం నిర్వహించారు. 27 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వర్షంలో తడవవద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా చూసుకోవాలని, జ్వర లక్షణాలు కన్పిస్తే పీహెచ్‌సీకి వచ్చి చికిత్స చేయించుకోవాలని కోరారు. ఎంపీటీసీ చింతగుంట్ల వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడుకు నాలుగు బార్లు మంజూరు

నూజివీడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం బార్లకు అనుమతులు మంజూరు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. 2025-28 సంవత్సరాలకు కొత్త పాలసీ ప్రకటించింది. ఈ నూతన పాలసీ ప్రకారం నూజివీడు పట్టణానికి నాలుగు బార్లు మంజూరయ్యాయి. నూతన పాలసీ నిబంధనల ప్రకారం ఒక్కొక్క బారుకు 2025-26 సంవత్సరానికి లైసెన్సు ఫీజు కింద రూ. 55 లక్షలు, 2026-27 సంవత్సరానికి రూ. 60 లక్షల 50 వేలు, 2027-28 సంవత్సరానికి రూ. 68 లక్షల 50 వేలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బార్ నిర్వహణ కోసం దరఖాస్తు చేసేవారు నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు కింద రూ. 5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు కింద పది వేలు చలానా రూపంలో ఆన్‌లైన్‌లో గాని, ఆఫ్‌లైన్‌లో గాని చెల్లించవలసి ఉంటుంది. వచ్చిన దరఖాస్తులను లాటరీ పద్ధతిలో డ్రా తీస్తారు. ఈ నెల 18వ తేదీ నుంచి 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి బార్‌కి 4 అప్లికేషన్లు కంటే ఎక్కువ వచ్చిన బార్లకే డ్రా తీయడం జరుగుతుంది. నూతన పాలసీ ప్రకారం ఇక నుంచి ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు బార్లు నిర్వహించుకోవచ్చు.

వాటర్ సంపుపై మూత ఏర్పాటు

నూజివీడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం మిట్టగూడెం శివారు లీలానగర్ ఎంపీపీ పాఠశాల వద్ద లీలానగర్, రామ్‌నగర్ ప్రాంతాలు తాగునీటి సరఫరా కోసం వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ట్యాంక్ సంపుపై మూత లేకపోవడంతో పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదంపై 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. స్పందించిన అధికారులు సదరు వాటర్ సంపుపై సిమెంట్ మూత ఏర్పాటు చేశారు.

రూ.3 లక్షల విలువైన ఆర్వో ప్లాంట్ వితరణ


ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ కృష్ణ

కైకలూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సురక్షితమైన తాగు నీరు అందించేందుకు దాతల సాయం అభినందనీయమని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. సోమవారం సీతనపల్లి పీహెచ్‌సీకి గ్రామానికి చెందిన శిరీషా ఆక్వా ఆధ్వర్యంలో విర్బాక్ కంపెనీ సహకారంతో రూ.3 లక్షల విలువైన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఎంపీపీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఆసుపత్రిలో నిత్యం రోగులకు మంచినీటి ఇబ్బంది లేకుండా ఈ ఆర్వోప్లాంట్ ద్వారా మినరల్‌వాటర్ అందజేయడం జరుగుతుందన్నారు. వైద్యాధికారి కె అన్నపూర్ణ, గ్రామస్థులు రాజా రమేష్‌చంద్ర, సర్పంచ్ సీహెచ్ పద్మావతి, విర్బాక్ కంపెనీ మేనేజర్లు ఫణీంద్రకుమార్, సత్యనారాయణ, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ



నూజివీడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం మర్రిబందం గ్రామ పరిధిలో ముద్దాయిగుంట ప్రభుత్వ మోడల్ ప్రైమరీ స్కూల్‌కు గ్రామానికి చెందిన పూసడపు శ్రీనివాసరావు రూ. 15 వేల విలువ చేసే బీరువాను సోమవారం బహూకరించారు. ఈ పాఠశాలలో రికార్డులు భద్రపరచుకునే సౌకర్యం లేకపోవడంతో దాత బీరువాను బహూకరించారు. హెడ్మాస్టర్ తొమ్మండ్రు యువరాజు దాతకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ వి. లక్ష్మి, ఎంపీటీసీ కళావతి, టీడీపీ గ్రామ నాయకుడు టి. నాగరాజు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి



చాట్రాయి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మగూడెం దళితవాడ పాఠశాలలో సోమవారం ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్థంతి సందర్భంగా హెచ్‌ఎం వెంకట్రావు, విద్యార్థులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ సాయుధ పోరాటంతోనే తెల్ల దొరలను దేశం నుంచి తరిమికొట్టడం సాధ్యమవుతుందని, ఎనలేని పోరాటాలు చేశారని, ఆయన పోరాట స్ఫూర్తితో విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు.


ముదినేపల్లిలో సర్వాయి పాపన్న గౌడ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

ముదినేపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, రాచరిక వ్యవస్థపై తిరుగుబాటు చేసి తెలంగాణ ప్రాంతాన్ని 30 ఏళ్లపాటు పాలించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి వేడుకలు సోమవారం ముదినేపల్లిలో ఘనంగా జరిగాయి. మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక గురజ రోడ్డు సెంటర్‌లోని పాపన్న గౌడ్ విగ్రహానికి గౌడ సంఘం నాయకుడు, కలిదిండి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్, విగ్రహ దాత బొర్రా శేషుబాబు, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, ముదినేపల్లి ఉప సర్పంచ్ ఈడే సుధాకర్, మండల గౌడ సంఘం అధ్యక్షుడు కనకారావు, ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు శీలం రామకృష్ణ, పెడన ఎంపీపీ అచ్యుతరావు, కూటమి నాయకులు తదితరులు పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చాట్రాయి: మండలంలోని తుమ్మగూడెంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఫీల్డ్ లేబర్ సొసైటీ సభ్యులకు న్యాయం చేయాలి

మండవల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉనికిలి ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులకు న్యాయం చేయాలంటూ సభ్యులు సోమవారం మండవల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. 330 మంది సభ్యులు కలిగిన ఈ సొసైటీలో 70 మందికి 70 ఎకరాలు ప్రభుత్వం గతంలో పట్టాలిచ్చిందని, దీనిపై వచ్చే ఆదాయాన్ని సభ్యులంతా సమష్టిగా పంచుకునే వాళ్లని వివరించారు. కొంతకాలంగా ఎవరికైతే పట్టాలున్నాయో వారే ఆదాయాన్ని పొందుతుండడంతో 270 మంది సభ్యులు అన్యాయం అయిపోతున్నారని వాపోయారు. అధికారులు సొసైటీ సభ్యులకి న్యాయం చేయాలని కోరారు. రాజాబాబు, బ్రహ్మం, రత్నారావు, యోహాను తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242



నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475


సి. గుడిపాడులో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో లక్ష్మీనారాయణ

యువకుడి మృతితో..

అప్రమత్తం

» సి. గుడిపాడులో జ్వరాల నివారణ చర్యలు
» గ్రామాన్ని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

చాట్రాయి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసింహారావుపాలెం శివారు సి. గుడిపాడులో కఠారు విజయ్ (25) అనే యువకుడు జ్వరంతో విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందటంతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమై జ్వరాల నివారణ చర్యలు చేపట్టింది. వారం రోజుల క్రితం విజయ్‌కి జ్వరం రావటంతో స్థానికంగా చికిత్స తీసుకున్నా తగ్గకపోవటంతో 14న విజయవాడ ప్రైవేటు ఆసుపత్రి లో చేరి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో లక్ష్మీనారాయణ గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటా జ్వరాల సర్వే, లార్వా సర్వే చేసి, దోమల నివారణ మందు పిచికారీ చేశారు.

పీహెచ్‌సీ వైద్యాధికారి ఏమన్నారు..?

దీనిపై చనుబండ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా, మృతుడు విజయ్‌కి క్రియాటిన్ 6.5, ఉపిరితిత్తుల సమస్య ఉన్నదని, వైరల్ ఫీవర్, కిడ్నీ ఫెయిల్యూర్ వల్ల చనిపోయినట్లు ప్రైవే టు ఆస్పత్రి వైద్యులు నివేదిక ఇచ్చారన్నారు. రేపు కూడా వైద్య శిబిరం, దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహిస్తామన్నారు. 316 గృహాలు సర్వే చేయగా ఒక్క జ్వరం కేసే నమోదైందన్నారు. వర్షాలు కురుస్తున్నందున ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమతెరలు వాడాలని, జ్వర లక్షణాలు కన్పిస్తే పీహెచ్‌సీకి వచ్చి చికిత్స పొం దాలని డాక్టర్ దుర్గాప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రాభివృద్ధికి కట్టుబడిన సీఎం

» మంత్రి పార్థసారథి » పలు భవనాలు ప్రారంభం
» కో-ఆపరేటివ్ బ్యాంక్ తనిఖీ » సిబ్బందిపై ఆగ్రహం


ఆగిరిపల్లిలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సారథి

నూజివీడు, ఆగస్టు 18, (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో మన నెత్తిన ఒక్కొక్కరిపై 2.50 లక్షలు అప్పు పెట్టి రూ. 10 లక్షల కోట్లు అప్పుచేసి రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసం చేసిందని నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం ఆగిరిపల్లిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని మన సీఎం చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పెడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చంద్రబాబు చొరవతో పారిశ్రామికవేత్తలు రూ. ఆరు లక్షల 50 వేల కోట్లు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చారన్నారు. రానున్న నాలుగేళ్ళ కాలంలో 20 లక్షల ఉద్యోగాలు యువతకు అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

నేను గ్యారెంటీ..

చిన్న, సన్నకారు రైతులకు, చిరు వ్యాపారులకు రుణాలు ఇవ్వాలని స్థానిక కో-ఆపరేటివ్ బ్యాంక్ అధికారులను మంత్రి కోరగా, ఇబ్బందులను అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన మంత్రి ఆగిరిపల్లిలో చిరువ్యాపారులుకు రుణాలు ఇస్తే దానికి గ్యారెంటీగా తాను ఉంటానని అధికారులకు హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం చేసిన రీ సర్వే వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాటిని పరిష్కరించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి రైతులకు హామీ ఇచ్చారు.

తొలుత మంత్రి ఆగిరిపల్లిలో రూ. 42 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయాన్ని, 23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ. 17.20 లక్షలతో నిర్మించిన పలు సీసీ రోడ్లు, జల జీవన్ మిషన్ ఆధ్వర్యంలో రూ. 45 లక్షల వ్యయంతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. స్థానిక టీడీపీ నాయకులు, కూటమి నేతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కో-ఆపరేటివ్ బ్యాంక్ సిబ్బందిపై ఆగ్రహం

అడవినెక్కలం గొల్లగూడెం గ్రామంలోని కోఆపరేటివ్ బ్యాంకును సోమవారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ బ్యాంకులో రికార్డులు సక్రమంగా నిర్వహించడం లేదని వచ్చిన ఫిర్యాదులపై మంత్రి ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి సక్రమంగా లేవని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకు నుంచి ఎంత మంది రైతులకు రుణాలు ఇచ్చారని ఆరా తీయగా సిబ్బంది నుంచి పొంతన లేని సమాధానాలు వచ్చాయి. దీంతో మంత్రి బ్యాంకు ఉన్నతాధికారులకు ఫోన్ చేసి మొత్తం ఈ బ్యాంకులో రుణాలపై విచారించి నిబంధనలు విరుద్ధంగా ఉన్నట్లయితే సదరు సిబ్బందిపై చర్యలు తీసుకోమని అధికారులకు స్పష్టం చేశారు.


ముసునూరులో త్రిసభ్య కమిటీకి టీడీపీ నాయకుల సత్కారం


కొర్లకుంట సొసైటీ అధ్యక్షురాలికి టీడీపీ నాయకుల అభినందన

తిసభ్య కమిటీల ప్రమాణ స్వీకారం

ముసునూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముసునూరు, కొర్లకుంట కో-ఆపరేటివ్ సొసైటీల నూతన త్రిసభ్య కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ముసునూరు సొసైటీ అధ్యక్షుడిగా దేవినేని శ్రీధర్, డైరెక్టర్లుగా గోగం కాటంరాజు, చీలి లక్ష్మి, కొర్లకుంట అధ్యక్షులుగా పొట్లూరి అనూరాధ, డైరెక్టర్లుగా నక్కనబోయిన సూరయ్య, అలుగుల సుమలతతో కార్యదర్శులు దాసిరెడ్డి లక్ష్మణరావు, పార్వతి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రైతులకు ఉత్తమ సేవలను అందించడంతోపాటు సొసైటీల అభివృద్ధికి కృషి చేస్తామని నూతన అధ్యక్షులు స్పష్టం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్ కిరణ్(బాబి), బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా యోహాను, ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, యువనేత తులిమెల్లి రంగరావు, మండల మాజీ అధ్యక్షులు దేవినేని ధలరాం, మాజీ జడ్పీటీసీలు చిలుకూరి వెంకటేశ్వరరావు, కందుల పిచ్చియ్య, సీనియర్ నాయకులు దేవినేని వరప్రసాదరావు, కొల్లి గంగారామ్, బొమ్మగంటి శ్యామలరావు, వేంపాడు మేజర్ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ, సొసైటీ మాజీ అధ్యక్షులు చలసాని కుటుంబరావుతోపాటు టీడీపీ గ్రామ అధ్యక్షులు, నూతన అధ్యక్షులను సన్మానించి అభినందనలు తెలిపారు. తొలుత భారీ ర్యాలీలు నిర్వహించి, రైతులు, నాయకులు, కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేశారు.

వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలి

కలిదిండి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ రామకృష్ణ ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పుటేరు తీర గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నివశించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వర్షాల కారణంగా ప్రమాదకర సంఘటనలు సంభవిస్తే వెంటనే తహసీల్దార్ కార్యాలయానికి తెలియజేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో-1

చాట్రాయి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం కోనేరు కాలనీ పాఠశాలను సోమవారం ఎంఈవో-1 ఎం. శ్రీనివాసరావు తనిఖీ చేశారు. విద్యా బోధన, విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యం, పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం, వంట గదులు, స్కూల్ ఆవరణలో చెట్లు మొదలైనవి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆర్. నాగేశ్వరరావు, ఉపాధ్యాయుల పనితీరును ఎంఈవో ప్రసంశించారు.

పారిశుధ్య సమస్య తలెత్తనివ్వద్దు

కలిదిండి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వర్షాల దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఫణీంద్ర పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డ్రెయినేజీల్లో పూడికను తొలగించి బ్లీచింగ్ చల్లాలన్నారు. తాగునీటి చెరువుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. ఈ నెల 19 నుంచి గ్రామాల్లో ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లకు 16 మంది ఎంపిక



చాట్రాయి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని జనార్దనవరంలో పాస్టర్ రమేష్‌బాబు, ఎంపీటీసీ పి. కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నూజివీడు అమెరికన్ హాస్పిటల్ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ దత్తు బృందం 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 16 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కంటి సంరక్షణపై డాక్టర్ దత్తు గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

వేగంగా.. సాగండి!

(5వ పేజీ తరువాయి)

ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలో లక్షా60వేల968 మంది రైతులకు రూ.107.08 కోట్లు అందించామన్నారు. జిల్లాలో వృద్ధిరేటు పెంచేందుకు వీలుగా ఉద్యానవన పంటల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాల న్నారు. జిల్లాలో యూరియా, డీఏపీ కొరత లేదన్నారు. ఆయిల్‌పామ్ గెలలు కోసే సమయంలో విద్యుత్ షాక్‌కు కూలీలు గురవుతున్నారని, దీనికి శాశ్వత పరిష్కారం కనుగొ నాలని మంత్రి సూచించారు. 2014-19 మధ్యన గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనుల్లో పెం డింగ్ బిల్లుల చెల్లింపుల్లో తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వా సితులకు అంత్యోదయ అన్నయోజన కార్డులను అందించామని, గిరిజన ప్రాంతాల్లో నివసించే వారికి వీటిని అందించే ప్రయత్నం చేస్తున్నామ న్నారు. వచ్చే సమా వేశం నాటికి కనీసం నాలుగు ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

నూజివీడులో ఆటోనగర్‌కు సహకారం : మంత్రి పార్థసారథి

నూజివీడులో ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసు కోవాలని, అవసరమైన భూసేకరణకు తాను పూర్తిగా సహాయ, సహకారాలను అందిస్తానని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. పీఎంఏవై-ఎన్టీఆర్ గృహనిర్మాణ కాలనీల్లో రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపాయా లకు ఉపాధి హామీ కింద చేపట్టాలని మంత్రి సూచిం చారు. మామిడికి ఎటువంటి చీడ,పీడలు సోకకుండా పూత దశలోనే గుర్తించి రైతులకు తగిన మందులను అందించాలని, కల్తీ విత్తనాలను అరికట్టాలన్నారు. ఆర్వోఎఫ్ఆర్ పథకం కింద రైతులకు అందించిన భూముల్లో సాగుకు అవసరమైన బోర్లకు అనుమతించా లన్నారు. ఇరిగేషన్ ఛానల్స్‌లో పూడికతీత పనులను కనీసం రెండుఅడుగుల లోతుకు తీయాలన్నారు. గత ఏడాది అక్రమ మైనింగ్ చేసిన వారిపై అపరాధ రుసుంగా రూ.3 కోట్లు విధించి వసూలు చేయాలన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు షట్టర్ మరమ్మతులకు తెలంగాణ ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కాగా భారీ వర్షాలు, వరదల కారణంగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.

గోదావరికి వరదపోటు

(5వ పేజీ తరువాయి)

స్తంభించాయి. గోదావరి ఎగువ భాగాన తెలంగాణలోని గోదావరి పరీవాహక జిల్లాలైన భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, ములుగు, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు రెడ్ ఎలర్ట్ ప్రకటించటంతో అక్కడ భారీ వర్షపాతం నమోదవుతోంది. నీరంతా గోదావరికే వచ్చి చేరనుండటంతో భద్రాచలం వద్ద వరద తీవ్రత అధికమయ్యే ప్రమాదం పొంచి ఉంది. భద్రాచలం నుంచి దిగువకు ఏడు లక్షల 19 వేల క్యూసెక్కుల వరద కిందకు వస్తోంది. బ్యాక్ వాటర్ రూపంలోను ముంపు ఏర్పడనుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. వరద ప్రభావంతో కుక్కునూరు మండలంలోని గుండేటివాగులో లెవెల్ కాజ్‌వే నీటమునిగింది. గోదావరి మరో 4 అడుగులు పెరిగితే ముంపు తప్పదని రైతాంగం ఆందోళన చెందుతోంది. కాగా ప్రజలెవరూ గోదావరి తీర ప్రాంతాలకు వెళ్లవద్దని, జాలర్లు వేట నిలిపేయాలని తహసీల్దార్ రమేశ్‌బాబు సూచించారు.. పోలవరం స్పిల్‌వేలోకి అదనంగా వస్తున్న 6,42,370 క్యూసెక్కుల జలాలను జలవనరుల శాఖ అధికారులు దిగువకు విడుదల చేశారు. పట్టిసీమ శైవక్షేత్రం చుట్టూ వరద జలాలు ఆక్రమించాయి.

నెల రోజులుగా అంధకారం

ముసునూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలం లోని రమణక్కపేట ఎస్సీ కాలనీలో నెలరోజులుగా వీధిలైట్లు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. దీంతో రాత్రి సమయాల్లో స్థానికులు బిక్కు బిక్కు మంటూ వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలకు రహదారులు బురదగా ఉన్నాయని, చీకటిలో వెళ్ళలేక ఇబ్బందులు పడుతున్నామని, దీనికి తోడు పాముల సంచారంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొందని కాలనీ వాసులు వాపోతున్నారు. ఎస్సీలు అంటే అంతా చులకనా అని, ఎవరో ఒకరి ప్రాణాలు పోతే తప్ప వీధిలైట్లు వేయరా అని కాలనీవాసులు మండి పడుతున్నారు. వెంటనే వీధిలైట్లు వేయకపోతే మండల కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ట్యాంకులతో నీటి సరఫరా చేస్తాం

నూజివీడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణానికి కృష్ణ వాటర్ సప్లై చేసే గొల్లపూడి వద్ద కృష్ణా నదిలో ఉన్న భారీ వరద ప్రవాహానికి అడ్డవచ్చిన గుర్రపుడెక్క, ఇతర వ్యర్థాల వలన ఆ పంప్ హౌస్ నుంచి నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నూజివీడు పురపాలక కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. వరద ప్రవాహం తగ్గిన తరువాత నూజివీడు పట్టణానికి తిరిగి కృష్ణా నీరు సరఫరా జరుగుతుందన్నారు. ట్రాక్టర్ ద్వారా మంచినీరు సరఫరా జరుగతుందని ఆయన తెలిపారు.

బాలికల జట్టుకు తృతీయ స్థానం



నూజివీడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఇటీవల జరిగిన అండర్-18 రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలలో నూజివీడుకు చెందిన బాలికల జట్టు తృతీయ స్థానం పొం దింది. ఈ జట్టును బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జి సుభాష్ చంద్రబోస్, ప్రధాన కార్యదర్శి డి సత్యనారాయణలు సోమవారం అభినందించారు.

అర్హుల పెన్షన్ ప్రభుత్వం తొలగించదు: వేంపాటి

కలిదిండి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగుల పెన్షన్లను కూటమి ప్రభుత్వం తొలగించదని అధైర్యపడవద్దని టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేంపాటి ప్రవీణ్ అన్నారు. సోమవారం కలిదిండిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల పెన్షన్లను తొలగిస్తున్నామని వైసీపీ దుష్ప్రచారం చేయటాన్ని ఖండించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అనర్హులు దొంగ సర్టిఫికెట్లతో పెన్షన్లు పొందారన్న ఆరోపణలపై ప్రభుత్వం దివ్యాంగుల పెన్షన్ల వెరిఫికేషన్ చేపట్టిందన్నారు.

భర్తతో మనస్పర్థలు.. పిల్లలతో సహా తల్లి అదృశ్యం


అదృశ్యమైన పిల్లలు, తల్లి శిరీష

ముదినేపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీహరిపురం గ్రామంలో తల్లీ పిల్లలు అదృశ్యమయ్యారు. భర్తతో మనస్పర్థల నేపథ్యంలో ఆ మహిళ తనతోపాటు పిల్లల్ని కూడా తీసుకుని వెళ్ళిపోయింది. పోలీసుల కథనం ప్రకారం శ్రీహరిపురం గ్రామానికి చెందిన సనకా రవీంద్రకు కలిదిండి మండలం కోరుకొల్లు గ్రామానికి చెందిన లక్ష్మీ శిరీషకు సుమారు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ప్రస్తుతం 12 సంవత్సరాల వయసు కలిగిన కుమారుడు, ఏడేళ్ల వయస్సున్న కుమార్తె ఉన్నారు. తాపీపని చేసుకుంటూ జీవిస్తున్న రవీంద్రకు భార్య శిరీషకు ఇటీవలి కాలంలో మనస్పర్థలు ఏర్పడగా తరచూ ఆమె పిల్లల్ని తీసుకుని కోరుకొల్లులోని పుట్టింటికి వెళ్ళిపోయేది. భర్త రవీంద్ర వెళ్ళి తిరిగి తమ ఇంటికి తీసుకువచ్చేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం శిరీష తన పిల్లలను తీసుకుని ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయింది. అత్తమామలకు ఫోన్ చేసి అడగ్గా తమ ఇంటికి రాలేదన్నారు. అప్పటి నుంచి పలుచోట్ల వెతికినా వారి ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం రవీంద్ర తన భార్యా పిల్లల అదృశ్యంపై ముదినేపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వారి ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కలిదిండి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన సోమవారం భాస్కరరావుపేటలో జరిగింది. గ్రామానికి చెందిన గుండాల శ్రీలక్ష్మి (45) సోమవారం ఇంటి ఆవరణలో మోటార్ వేసి కుళాయి నీరు పట్టుకుంటుండగా, మోటారు వైరు చేతికి తగలటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె మృతితో కుటుంబసభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ కె.నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

కలిదిండి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): గుళికలు తిని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. కలిదిండికి చెందిన ఏలూరి వాణి (22) భర్త పవన్‌కి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. భర్త మద్యానికి బానిసై కుటుంబ పోషణ పట్టించుకోకుండా ఆమెను శారీరకంగా, మానసికంగా హింసిస్తుండడంతో మనస్థాపానికి గురై సోమవారం గుళికలు మింగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కలిదిండి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేసి భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తర లించగా, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.